ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పల్నాడు జిల్లా వార్తలు
5 గురువారం 8 ఆగస్టు 2024



పులిచింతల వద్ద వరద ఉధృతి

ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

కృష్ణమ్మ పరవళ్లు


కృష్ణమ్మ సాగరం దిశగా పరుగులు పెడుతూ ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వరద ఉధృతి పెరుగుతూ ఉంది. దీంతో నాగార్జున సాగర్ నుంచి దిగువను ఉన్న అన్ని ప్రాజెక్టుల బంధనాలు తెంచుకుని సాగరంలో కలిసేందుకు పోటెత్తుతూ ప్రవహిస్తోంది. సోమవారం సాగర్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయగా రెండు రోజుల్లోనే పులిచింతల నిండుకుండలా మారింది. దీంతో బుధవారం పులిచింతల ప్రాజెక్టు గేట్లు కూడా ఎత్తి దిగువకు నీటి విడుదల చేశా రు. యథావిధిగా ప్రకాశం బ్యారేజి గేట్లును ఎత్తి ఉంచి నీటిని వదులుతున్నారు. ప్రవాహ ఉధృతి అంతకంతకూ పెరుగుతూ ఉండ టంతో కృష్ణానది పరివాహక ప్రాంతంలో ప్రజలను, రైతులను అధికారులు అప్రమత్తం చేశారు.

- కొనసాగుతున్న వరద ఉధృతి
- సాగరం దిశగా పోటెత్తుతోన్న వరద
- సాగర్ 18, పులిచింతల 13 గేట్లు ఎత్తి విడుదల



సాగర్ క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

బ్యారేజీ వద్ద ఉధృతిని పరిశీలించిన సీఎం చంద్రబాబు



బ్యారేజీ వద్ద నీటి ఉధృతిని పరిశీలిస్తున్న సీఎం

ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతిని సీఎం చంద్రబాబు బుధవారం పరిశీలించారు. విజయవాడలో చేనేత దినోత్సవ కార్యక్రమం ముగించుకుని ఉండవల్లి వస్తూ బ్యారేజిపై కాన్వాయ్‌ను నిలిపి కిందకి దిగారు. కృష్ణమ్మ పరవళ్లను ఆసక్తిగా తిలకించారు. కృష్ణమ్మకు జలకళ, నీటి ప్రవాహం సంతృప్తిగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి 1 లక్ష 36 వేలు, కీసర వాగు నుంచి 15 వేల క్యూసెక్కుల వరద నీరు బుధవారం ప్రకా శం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారే జి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 50 గేట్లను 3 అడుగులు, 20 గేట్లను 2 అడుగులు వంతున ఎత్తి దిగువకు 1 లక్ష 37వేల 500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు 13వేల 500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు. కాగా బుధ వారం అర్ధరాత్రికి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున తీరం వెంబడి రైతు లు, మత్స్యకారులు, లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని అధి కారులు సూచించారు.



కొల్లిపర కృష్ణానది రేవులో లంక గ్రామాల నుంచి పడవల ద్వారా వస్తున్న రైతులు



పులిచింతల వద్ద కృష్ణమ్మకు సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, శ్రీరాం తాతయ్య



తాడువాయి కృష్ణా నది ఒడ్డున నిలిచిన మత్స్యకారుల పడవలు

మాచర్ల రూరల్, అచ్చంపేట, వీపీ సౌత్, రెం టచింతల, అమరావతి, తాడేపల్లి టౌన్, నూ జెండ్ల / నరసరావుపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్, పులిచింతలకు భారీగా వరద కొనసాగుతోంది. జలాశయాల నీటి నిల్వ పూర్తి స్థాయికి చేరుకున్నాయి. సాగర్ డ్యాం 18 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు 2,24,574 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో పులిచింతల నిండు కుండలా మారింది. పులిచింతలలో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరడంతో బుధవారం ఉదయం 13 గేట్లు ఎత్తి దిగువకు 2.78 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, శ్రీరాం తాతయ్య స్విచ్ అన్ చేసి నీటిని విడుదల చేశారు. అంతకముందు వారు కృష్ణమ్మకు పూజలు చేసి, జలహారతి ఇచ్చారు. కృష్ణమ్మకు సారె సమర్పించారు. జలాశయం ఆరు గేట్లను రెండున్నర మీటర్లు, ఏడు గేట్లను మూడు మీటర్ల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా బుధవారం 168.86 అడుగులకు చేరింది. 45.77 టీఎంసీలకు 36.78 టీ ఎంసీలకు నీటి నిల్వలు చేరుకున్నాయి. పులిచింతలకు 2,50,518 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా గేట్ల ద్వారా 2,78,573, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 10,000 మొత్తం 2,88,573 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల నుంచి కృష్ణమ్మ ప్రకాశం బ్యారేజీకి పరుగులు పెడుతోంది. భారీగా నీటిని విడుదల చేయడంతో దిగువ ప్రాంతాల వారిని అప్రమత్తం చేశారు. నది వైపు వెళ్లకుండా పోలీసు, రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. దిగువ కృష్ణలో కృష్ణా జలాలు పెరగటంతో మత్స్యకారుల పడవలన్నీ ఒడ్డుకు చేరాయి. తాడువాయి వద్ద నది నుంచి మత్స్యకారులు తమ పడవలును ఒడ్డుకు చేర్చారు. పులిచింతల ప్రాజెక్టు నుంచి భారీగా నీటి ప్రభావంతో అమరావతి వద్ద కృష్ణానది జలకళను సంతరించుకుంది. సంవత్సర కాలంగా ప్రవాహం లేకపోవడంతో కళతప్పిన కృష్ణమ్మ ప్రస్తుతం పరుగులు తీస్తున్న నీటితో సరికొత్త కళను సంతరించుకుంది. నీటి పరవళ్లు చూసేందుకు స్థానికులు పెద్దసంఖ్యలో అమరావతి తీరానికి తరలి వస్తున్నారు.

గుండ్లకమ్మకు జలకళ

నాలుగు రోజులుగా సాగర్ జలాలు విడుదలతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తోన్న వర్షాలతో గుండ్లకమ్మ నది జలకళను సంతరించుకుంది. నూ జెండ్ల మండలంలోని గుండకమ్మ నది పరివాహ ప్రాంతాల్లో సాగు, తాగు నీటి కష్టాలకు ఉపశ మనం లభించినటయింది. వరి నారుకు ప్రసిద్ధి గాంచిన ఐనవోలు గ్రామంలో నారుమళ్లను రైతులు సిద్ధం చేసుకుంటున్నారు.



జలకళతో గుండ్లకమ్మ నది

సాగర్‌లో కొనసాగుతోన్న విడుదల

నాగార్జున సాగర్‌కు భారీగా వరద కొనసాగుతుండటంతో జలాశయం నీటి నిల్వ పూర్తి స్థాయికి చేరింది. డ్యాం 18 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. 3,50,730 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా క్రస్ట్ గేట్లను ఒక్కొక్కటి 10 అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. గేట్ల నుంచి 2,24,574, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 29,151, కుడి కాల్వకు 6,873, ఎడమ కాల్వకు 8,193 క్యూసెక్కుల వెరసి 2,70,591 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. సాగర్ నీటి మట్టం 590 అడుగులకు 584.60 అడుగులకు చేరింది. సామర్థ్యం 312.05 టీఎంసీలకు 296.28 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

వచ్చిన నీరు వచ్చినట్లే దిగువకు: ఎస్ఈ వెంకటరమణ

సత్రశాల వద్ద నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తోన్న నీటిని వచ్చిన మేర దిగువన ఉన్న పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కోలేగుండ్ల వెంకటరమణ చెప్పారు. బుధవారం సాగర్ నుంచి 2 లక్షల 76 వేల క్యూసెక్కుల నీరు రాగా టెయిల్ పాండ్ ప్రాజెక్టు 12 గేట్లను 4 మీటర్ల మేర ఎత్తి దిగువకు పంపుతున్నామన్నారు. విద్యుత్ ఉత్పత్తిని నిలిపి వేశామన్నారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 74.02 మీటర్ల నీరుండగా ఈ నీరు 6.2 టీఎంసీలకు సమానమన్నారు.

వరద.. వణుకు

- బ్యారేజి దిగువ ప్రాంతాల్లో ముంపుభయం
- సముద్రంలోకి 1.5 లక్షల క్యూసెక్కులు నీరు
- నేడు 3 నుంచి 4 లక్షల క్యూసెక్కులకు ప్రవాహం
- పెరుగుతోన్న వరద ఉధృతి.. అధికారులు అప్రమత్తం

తెనాలి(ఆంధ్రజ్యోతి), కొల్లిపర, ఆగస్టు 7: కృష్ణానదీ పరివాహక గ్రామాల ప్రజల్లో వరద భయం మొదలైంది. బ్యారేజి దగ్గర పట్టిసీమ నీరు పుష్కలంగా ఉండటంతో పులిచింతల నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లుగా సముద్రంలోకి వదిలేస్తున్నారు. ప్రస్తుతం నదిలో 1.5 లక్షల క్యూసెక్కుల వరకు మాత్రమే వరద నీరు ప్రవహిస్తున్నా, గురువారానికి మరింత పెరిగే పరిస్థితి ఉంది. దీంతో బ్యారేజి దిగువనున్న లంక గ్రామాలను ముంపు భయం వెంటాడుతోంది. ఇప్పటికే అరటి, పసుపు, కంద, తమలపాకు, బొప్పాయి వంటి వాణిజ్యపంటలు చేలల్లో ఉన్నాయి. బుధవారం పులిచింతల నుంచి 2,92,462 క్యూసెక్కుల నీటిని బ్యారేజికి వదిలారు. ఆ నీరు గురువారం తెల్లవారుజాము నుంచి బ్యారేజి దిగువకుచేరే పరిస్థితి ఉందని అధికారులు చెబుతున్నారు. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో 73వేల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా సాయంత్రం 4 గంటలకు అది 1.30 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. బ్యారేజి దిగువున కృష్ణా నదిలో 9 నుంచి 12 అడుగుల వరకు నీటి మట్టం పెరిగే పరిస్థితి ఉంది. దీంతో లంక గ్రామాల్లో జనం, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చి పంటలకు నష్టం ఏర్పడుతుందనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముంపు ప్రాంతాల్లో మాత్రం రైతులు విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజన్లను ఒడ్డుకు చేర్చుతున్నారు. వరద ప్రభావం పెరుగుతుందన్న ఆలోచనతో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. లంకగ్రామాల్లో, నది మధ్య ఉన్న గ్రామాల ప్రజలు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు ఎప్పుడైనా వచ్చేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. బ్యారేజి దిగువున ఉన్న గుంటూరు జిల్లా తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, బాపట్ల జిల్లా కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల నదీ తీర గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వరద నీటి ప్రవాహం నిలకడగా ఉంటే పర్వాలేదని, పెరిగే పరిస్తితి ఉంటే మాత్రం సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రెండు జిల్లాల కలెక్టర్లు ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు. కొల్లిపర తహశీల్దార్ సిద్ధార్థ, ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రమోహన్‌వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం కొల్లిపర, బొమ్మువాని పాలెం, అన్నవరం రేవులను సందర్శించి వరద ఉధృతిని పరిశీలించారు. జాలర్లు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.



విత్తనం కోసం క్యూ

- అన్నదాతలను వేధిస్తున్న కొరత
- నరసరావుపేటలో బారులు తీరిన రైతులు
- స్లిప్‌ల కోసం ఎగబడటంతో వారి మధ్య తోపులాట
- వర్షాన్ని లెక్కచేయకుండా మహిళలు సైతం పడిగాపులు
- చేతులెత్తేసిన వ్యవసాయ శాఖ.. అన్నదాతలకు అగచాట్లు





నరసరావుపేటలో విత్తనాల కోసం బారులు తీరిన రైతులు

నరసరావుపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆశాజనకంగా వర్షాలు.. నాగార్జున సాగర్ నుంచి నీటి విడుదల.. ఖరీఫ్‌కు ఈ సారి ఇబ్బంది ఉండదు.. సాగు కష్టాలు తీరినట్లే.. అని ఉత్సాహంగా వ్యవసాయ పనులు మొదలు పెట్టిన అన్నదాతలకు ఆదిలోనే అవస్థలు మొదలయ్యాయి. గత ఏడాది ఖరీఫ్‌లో సాగర్ ఆయకట్టులో సాగు నీటి కరువుతో వరి సాగు చేయక రైతులు ఆర్థికంగా నష్టపోయారు. సాగర్ జలాశయం నిండటం.. కుడి కాల్వకు నీరు విడుదలతో రైతుల్లో నెలకొన్న ఆనందాన్ని విత్తన కొరత ఆవిరిచేస్తోంది. వారం నుంచి విత్తనం కోసం దుకాణాల వద్ద గంటల కొద్ది పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. వరి విత్తన సమస్య రోజురోజుకు జటిలమవుతున్నా అధికారుల్లో స్పందన లేదు. జేజీఎల్ 384 రకం వరి విత్తనం కోసం నరసరావుపేటలో బుధవారం రైతులు బారులు తీరారు. పల్నాడు జిల్లా నుంచే కాకుండా పొరుగు జిల్లాలైన బాపట్ల, ప్రకాశం రైతులు కూడా పెద్దసంఖ్యలో నరసరావుపేటకు తరలి వచ్చారు. ఏపీ సీడ్స్ డీలర్ నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాల్‌లో స్లిప్‌లు పంపిణీ చేశారు. వీటి కోసం రైతులు ఎగబడ్డారు. ఒక దశలో రైతుల మధ్య తోపులాట జరిగింది. వర్షంలోనూ మహిళా రైతులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఇలా రైతులు ఇబ్బందులకు గురవుతున్నా సంబంధిత అధికారులు కనీస చర్యలు కూడా తీసుకోలేదు. గ్రామాల నుంచి తెల్లవారుజామునే నరసరావుపేటకు చేరుకుని డీలర్ల వద్ద గంటల కొద్దీ క్యూలో ఉంటున్నా కావాల్సిన విత్తనం దొరకడం గగనంగా మారింది. 400 బస్తాలు మాత్రమే స్టాక్ ఉండటంతో ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున విక్రయించారు. స్టాక్ అయిపోవడంతో అధిక సంఖ్యలో రైతు లు సాయంత్రం వరకు పడిగాపులు కాసి వెను దిరిగారు.

రైతులకు కావాల్సినవి బ్లాక్..

ప్రభుత్వం బీపీటీ 5204 రకం వరి విత్తనాన్ని కిలోకు రూ.5 రాయితీ ఇస్తోంది. ఈ రకం విత్తనం సాగుకు రైతులు ఇష్ట పడటంలేదు. జేజీఎల్ 384 రకం సాగుపై ఆసక్తి చూపుతున్నారు. అయితే ఈ విత్తనాల నిల్వలు లేవని వ్యవసాయ అధికారులు చేతులెత్తేస్తు న్నారు. కొందరు డీలర్లు జేజీఎల్ 384 రకం విత్తనాలను బ్లాక్ మార్కెట్ తరలించి అ ధిక ధరల కు విక్రయి స్తు న్నారు. జేజీఎల్ 384 రకం పంట స్వల్పకాల వ్యవధితో పాటు మార్కెట్‌లో ఈ ధాన్యానికి మంచి ధర లభిస్తుండటం, అధిక దిగుబడులతో రైతులు ఈ విత్తనాలను విక్రయించాలని కోరుతున్నారు. తెలంగాణలోని జగిత్యాల వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొం దించిన ఈ విత్తన నిల్వలు అక్కడ ఎక్కువగా ఉన్నట్లు రైతులు చెబు తున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని దిగుమతి చేసేందుకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.



విత్తనం కోసం క్యూలో మహిళా రైతులు

ప్రత్యామ్నాయ రకాలున్నాయి..

జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని ఇందుకు 32 వేల క్వింటాళ్ల విత్తనం డిమాండ్ ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే కేవలం 5 వేల క్వింటాళ్ల వరకే రాయితీపై ఇవ్వనున్నది. జేజీఎల్ 384 విత్తనాలకు ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1224, ఎంటీయూ 1282, ఎన్ఎల్ఆర్ 34449 రకాల విత్తనాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఆయా రకాల కాల వ్యవధి 125 రోజులు, జేజేలు కన్నా 10 రోజులు ముందుగానే పంట చేతి వస్తుందని, దిగుబడి జేజీఎల్ 384తో సమా నంగా వస్తుందం టున్నారు. ఈ రకాలు అగ్గి తెగులు తట్టు కుం టాయని చెప్పారు. రైతులు జేజీఎల్‌కు ప్రత్యామ్నాయ రకాలను సాగు చేసుకోవాలని వారు కోరారు. అయితే వ్యవసాయ అధికారుల సూచనలు రైతులు పాటిస్తే కొంత మేర విత్తన సమస్య తీరుతుంది.

30 రోజుల్లో జంగిల్ క్లియరెన్స్

- పనులు ప్రారంభించిన మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, ఆగస్టు 7: ఐదేళ్ల వైసీపీ ప్రభు త్వం రాజధాని అమరావతిని అడవిలా చేసింది.. మేము 30 రోజుల్లో జంగిల్ క్లియరెన్స్ చేసి అమరావతికి ఓ రూపు తెస్తాం.. అని మంత్రి నారాయణ తెలిపారు. వెలగపూడి సచివాలయ పరిసరాల్లో బుధవారం తాడి కొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌తో కలిసి మంత్రి నారాయణ జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రారంభించారు. వర్షంలోనే తొలుత పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి ఎక్స్‌క వేటర్ ఎక్కిన మంత్రి, ఎమ్మెల్యేలు పది నిమిషాలు సేపు కంప తొలిగించారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం 24 వేల ఎకరాను అడవిలా చేసిందన్నారు. జగన్‌రెడ్డి మూడు ముక్కలాటతో అమరావతికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు అమరావతి నిర్మా ణాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. అమరావతిలో ముఖ్యమంత్రి పర్యటించినప్పుడు ఎత్తైన భవనాలు సైతం అడవి మధ్యలో ఉన్నట్లు కనిపించాయన్నారు. ఈ పరిస్థితి నుంచి ముందుగా అమరావతిని పూర్తిగా బయటకు వచ్చేలా కంప, తుమ్మ చెటట్లను తొలగించాలని సీఎం ఆదేశించారన్నారు. అందులో భాగంగానే ముందు అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. రూ.36.5 కోట్లతో 23 వేల 429 ఎకరాల్లో జంగిల్ క్లయరెన్స్ పనులను 30 రోజుల్లో పూర్తి చేసేలా ఆదేశా జారీ చేసినట్లు తెలిపారు. అమరావతి పనులకు ఇది మొదటి అడుగన్నారు. అమరావతి నిర్మాణాలపై అధ్యయనం చేసిన ఐఐటీ హై దా్రబాద్, మద్రాసు నుంచి త్వరలో ప్రాథమిక నివేదిక వస్తుందని దాని ఆధారంగా నిర్ణయం తీసుకుంటుమన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ అమరావతిని నాశనం చేసిన జగన్ ప్రజలపై భారం వేశాడన్నారు. ఈ కార్యక్రమంలో రైతు జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎక్స్‌కవేటర్లతో జంగిల్ క్లియరెన్స్

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

రైట్ టు బి ఫర్గాటెన్ గోప్యత హక్కు!

మనసుకు అయ్యే గాయాన్ని మాన్పే శక్తి కాలానికి ఉందంటారు. అయితే ఆ గాయాన్ని పదేపదే జ్ఞప్తికి తెస్తుంటే? ఒకవేళ చేయని నేరానికి బలైనవారిని, ఆ నేరం వారు చేయలేదని రుజువైనప్పటికీ ఒకప్పుడు నేరారోపణ చేయబడ్డాడని నిరంతరం ప్రచారం చేస్తుంటే? సదరు వ్యక్తులకు ఉన్న వ్యక్తిగత స్వేచ్ఛను, గోప్యత స్వేచ్ఛను ఉల్లంఘించినట్లు కాదా?

ఇదే అంశం ఇటీవల ఒక కేసు రూపంలో సుప్రీం కోర్టు ముందుకు వచ్చింది. గతంలో లైంగికదాడి, మోసం కేసులో ఒక వ్యక్తిని దిగువ కోర్టు నేరస్థునిగా పేర్కొంటూ తీర్పుని ఇచ్చింది. అయితే తరువాత కాలంలో అతన్ని ఎగువకోర్టు నిర్దోషిగా ప్రకటించింది. కానీ లీగల్ సెర్చ్ పోర్టల్ 'ఇండియన్ ఖానూన్'లో దిగువకోర్టు ఇచ్చిన తీర్పు వివరాలు ప్రకటితమవుతుండటంతో సదరు వ్యక్తి దరఖాస్తు చేసుకున్న విదేశీ పౌరసత్వ అప్పీలును తిరస్కరించారు. ఈ ప్రకారం అతడు చేయని నేరానికి మళ్లీ మళ్లీ శిక్షించబడుతున్నట్లే. అదే అంశాన్ని ప్రస్తావిస్తూ ఆ వ్యక్తి మద్రాసు హైకోర్టును ఆశ్రయించి రైట్ టు బి ఫర్గాటెన్(మరచిపోవు హక్కు)ను అభ్యర్థించాడు. ఇండియన్ ఖానూన్ పోర్టల్ నుంచి తనకు సంబంధించిన తప్పుడు సమాచారాన్ని తొలగించమని ఆదేశించాల్సిందిగా కోరాడు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

ఈ నేపథ్యంలో మద్రాసు హైకోర్టు ఇండియన్ ఖానూన్ సంస్థను సదరు వ్యక్తికి సంబంధించిన సమాచారాన్ని తొలగించమని ఆదేశిస్తూ తీర్పునిచ్చింది. ఇండియన్ ఖానూన్ పోర్టల్ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసింది.

ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అధ్యక్షతన ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ కేసును విచారణకు స్వీకరించడంతో 'రైట్ టు బి ఫర్గాటెన్' అనే హక్కుకు సంబంధించి కొన్ని నిర్ధారణలు వెలువడనున్నాయి. అసలు రైట్ టు బి ఫర్గాటెన్ అనేది ప్రాథమిక హక్కు అవుతుందా? ఒకవేళ అయితే, అది రాజ్యాంగం ప్రసాదించిన ఇతర ప్రాథమిక హక్కులతో ఏవిధమైన సంబంధం కలిగి ఉంటుంది? అనే అంశాలను దేశ అత్యున్నత న్యాయస్థానం పరిశీలించనుంది.

అసలు 'రైట్ టు బి ఫర్గాటెన్' అంటే ఏమిటి? ఎవరికి వర్తిస్తుంది? భారతదేశంలో దానికి గల చట్ట, న్యాయపరమైన పునాదులేవి? సదరు హక్కు లాభ - నష్టాలేమిటి? చూద్దాం.

● 'రైట్ టు బి ఫర్గాటెన్' అంటే?

అనవసరమైన లేదా అసందర్భమైన తన వ్యక్తిగత సమాచారాన్ని బహిరంగ సామాజిక వేదికల నుంచి అంటే ఇంటర్నెట్, సెర్చ్ ఇంజన్లు, డేటాబేస్‌లు, వెబ్‌సైట్లు, ఇతరత్రా ఏదైనా సమాచార మాధ్యమాల నుంచి తీసివేయించడానికి ఒక వ్యక్తికి గల హక్కునే రైట్ టు బి ఫర్గాటెన్ లేదా రైట్ టు బి ఎరేజర్ అంటారు.

ఒక వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని ఎటువంటి అవశ్యకత, చట్టపర అవసరం లేనప్పటికీ, అందరికీ బహిరంగంగా ఆ సమాచారాన్ని అందుబాటులో ఉంచి, అతని గోప్యతా హక్కును ఉల్లంఘించినప్పుడు ఒక వ్యక్తి రైట్ టు బి ఫర్గాటెన్(రీ) ఎరేజర్‌ను ఆశ్రయించే వీలుంది.

భారత్‌లో ఈ హక్కుకు ఇతిమిద్ధ రూపం లేనప్పటికీ, ఈయూ దేశాల్లో వారు తీసుకువచ్చిన 'జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్(జీడీపీఆర్)' ఈ హక్కు ను వారికి అందిస్తోంది. అయితే దగ్గర కూడా కొన్ని తీర్పుల్లో, హక్కుల్లో, చట్టాలు, బిల్లుల్లో ఇది ప్రతిఫలిస్తోంది.

● భారతదేశంలో ప్రస్తావనలు

రైట్ టు బి ఫర్గాటెన్ అనే హక్కును, భారత రాజ్యాంగం కల్పిస్తున్న ప్రాథమిక హక్కుల్లోని, జీవించే హక్కు(ప్రకరణ 21)లో అంతర్భాగమైన గోప్యతా హక్కు పరిధిలోకి వచ్చే అంశంగా 'కె.ఎస్.పుట్టస్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసు (2017) తీర్పులో ప్రస్తావించింది. అంతేకాక కొన్ని హైకోర్టులు(ఢిల్లీ, కర్ణాటక) కూడా వివిధ కేసుల్లో ఇంచుమించు ఇదేవిధమైన తీర్పులు ఇచ్చి ఉన్నప్పటికీ, సుప్రీం కోర్టు కె.ఎస్.పుట్టస్వామి కేసు తీర్పులో ఇచ్చిన ప్రాథమిక నియమావళి రైట్ టు బి ఫర్గాటెన్‌కు ఒక ప్రాతిపదికను ఏర్పర్చింది. న్యాయవ్యవస్థకు ఒక మార్గదర్శనం చేసింది.

ఇక చట్టాలపరంగా తీసుకుంటే 'డిజిటల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ (2023)'లో రైట్ టు బి ఫర్గాటెన్‌కు ఒక చట్ట ప్రాతిపదిక కనిపిస్తుంది. వ్యక్తుల వ్యక్తిగత సమాచారాన్ని డిజిటల్ స్పేస్‌లో వారు నియంత్రించుకోగల సౌలభ్య అంశం ఈ చట్టంలో ఉంది. ఏ వ్యక్తి గురించిన వ్యక్తిగత సమాచారం డిజిటల్ స్పేస్‌లో అతడి/ఆమె వ్యక్తిగత గోప్యతకు, ప్రతిష్ఠకు, భద్రతకు నష్టం కలిగించేదిగా ఉన్నప్పుడు దానిని తొలగించమని డేటా నిర్వాహకులను కోరవచ్చు. వారు తొలగించని పక్షంలో రెగ్యులేటరీ అథారిటీ(లేదా) న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. అంతేకాక ప్రతిపాదిత పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు (2019)లో కూడా రైట్ టు బి ఫర్గాటెన్ గురించిన ప్రతిపాదన ఉంది.

● పరిమితులు

సుప్రీంకోర్టు నిర్దేశనల ప్రకారం, ఒక వ్యక్తి వ్యక్తిగత సమాచారం ఎటువంటి చట్టపరమైన ఆవశ్యకతను కలిగి లేనప్పుడు, అవసరత, సంబంధం కానీ ఇతరత్రా లేనప్పుడు, అసత్యమైనప్పుడు దానిని తొలగించుకునే హక్కు ను సదరు వ్యక్తి పొందుతాడు.

అయితే భావవ్యక్తీకరణ హక్కుతో ముడిపడినప్పుడు, చట్టపరమైన అవసరాలు గల సమాచారమైనప్పుడు, ప్రజా ప్రయోజనాల సంబంధితమైనప్పుడు రైట్ టు బి ఫర్గాటెన్ వర్తించదని కూడా విస్పష్టం చేయడం జరిగింది.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/TgHS0Wqలో చూడండి.

దిక్సూచి

లాభ నష్టాలు



ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించినట్లు రైట్ టు ప్రైవసీ(గోప్యతా హక్కు) అనేది రైట్ టు ఇన్ఫర్మేషన్(సమాచార హక్కు)తో సమన్వయం కావాలి. రైట్ టు బి ఫర్గాటెన్ ఎంత ఆవశ్యకమో, సమాచార స్వేచ్ఛ కూడా అంతే అవసరమనే వాద ప్రతివాదనలు ఉన్నాయి.

లాభాలు

- ★ నిరపరాధులు తమ గౌరవాన్ని కాపాడుకోవడానికి వీలవుతుంది.
- ★ సమాచారం తీవ్రంగా దుర్వినియోగం అవుతూ, అసత్యాలు, పాక్షిక సత్యాలు (ఉదా: ఫేక్ న్యూస్, రివేంజ్ పోర్న్, మార్ఫ్‌డ్ కంటెంట్) ప్రచారమవుతున్నఈ డిజిటల్ యుగంలో రైట్ టు బి ఫర్గాటెన్ వంటి హక్కులు వ్యక్తి గౌరవాన్ని, గోప్యతను, ప్రతిష్ఠను రక్షిస్తాయి.
- ★ వ్యక్తిగత భద్రత, స్వేచ్ఛపరంగా అనవసర సమాచారం అందరికీ సులువుగా అందుబాటులో లేకుండా, మోసాలు, ఐడెంటిటీ తెఫ్ట్ వంటి వాటికి గురవకుండా రక్షణ లభిస్తుంది.

నష్టాలు

- ★ రైట్ టు బి ఫర్గాటెన్ ఒక ప్రాథమిక హక్కుగా లభిస్తు, తరచూ మరికొన్ని చట్టబద్ధ/ ప్రాథమిక హక్కులైన సమాచార హక్కు, భావప్రకటన స్వేచ్ఛ, పరిశోధన, పాత్రికేయ స్వేచ్ఛలతో సంఘర్షణ ఏర్పడుతుంది.
- ★ సాంకేతికంగా డిజిటల్ సంస్థలకు ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. భారీఎత్తున సమాచారం నిరంతరం తొలగించాల్సిన పరిస్థితితో ప్రత్యేక యంత్రాంగం, సాంకేతికతల ఆవశ్యకత ఏర్పడుతుంది.
- ★ సెర్చ్ ఇంజన్లు ఇచ్చే సమాచారం విపరీతంగా కుంచించబడుతుంది. ఒక అంశంతో అనేక ఉప అంశాలు ముడిపడి ఉన్నప్పుడు వ్యక్తిగత స్వేచ్ఛ హక్కు కారణంగా అవి తొలగించాల్సి వస్తే సమాచారం అతుకుల బొంతగా తయారవుతుంది.
- ★ బ్లాక్‌చైన్ టెక్నాలజీ నేపథ్యంలో సమాచారాన్ని పూర్తిగా తొలగించడం, పునరావృతం కాకుండా చూడటం దుర్లభం.

ఇలాంటి వాదోపవాదాల/ లాభ-నష్టాల నేపథ్యంలో ప్రస్తుతం రైట్ టు బి ఫర్గాటెన్ అనేది ప్రాథమిక హక్కుల పరిధిలోకి వస్తుందా? ఒక హక్కుగా స్థిరీకరించి ప్రజలకు అందుతుందా అనే అంశాలతోపాటు ఇతర ప్రాథమిక హక్కుల పరిధిలోకి వెళ్లి సంఘర్షణ ఏర్పడినప్పుడు ఏమి చేయాలనే అంశాలు సుప్రీంకోర్టు పరిశీలనార్థం ఉన్న ఇండియన్ ఖానూన్ కేసు సముఖంగా తేలాల్సిందే.

జగన్ అక్రమాస్తుల కేసులో..

ఏమిటీ కాలయాపన?

(మొదటి పేజీ తరువాయి)

మార్గదర్శకాల ప్రకారం విచారణ సాగించాలని ఆదేశించింది. జగన్ అక్రమాస్తుల కేసు విచారణను వేగవంతం చేయాలని, కేసుల ట్రయల్‌ను తెలంగాణ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని, జగన్ బెయిల్ రద్దు చేయాలని కోరుతూ టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేయడం తెలిసిందే. వాటిపై ఈ ఏడాది మే 2న సీబీఐ అఫిడవిట్ వేసింది. 'కేసుల్లో నిందితులుగా ఉన్నవారు ఒకరి తర్వాత మరొకరు డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తున్నారు. ట్రయల్ సాగకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఇప్పటివరకు 39 క్వాష్ పిటిషన్లు, 95డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై తీర్పులు ఇవ్వడానికి ముందే న్యాయాధికారులకు స్థానచలనం కలుగుతోంది. ఈ కేసులో ఉన్న నిందితులంతా శక్తిమంతులే' అని సీబీఐ అందులో పేర్కొంది. దీనిపై బుధవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. బెంచ్ ముందుకు మొదటి కేసుగా జగన్ అక్రమాస్తుల కేసుపైనే విచారణ జరగాల్సి ఉంది. అయితే.. అదనపు సొలిసిటర్ జనరల్ రాజు అందుబాటులో లేకపోవడంతో రెండో కేసు నుంచి విచారణను ప్రారంభించారు. నాలుగో కేసు విచారణ జరుగుతుండగా రాజు వచ్చి జగన్ కేసును ప్రస్తావించగా జస్టిస్ ఖన్నా అసహనం వ్యక్తం చేశారు. పేజీల కొద్దీ అఫిడవిట్ దాఖలు చేశారే తప్ప అందులో విషయమే లేదని, మధ్యాహ్నం 2 గంటలకు విచారణ చేస్తామని స్పష్టం చేశారు. తిరిగి విచారణకు వచ్చినప్పుడు మళ్లీ రాజు అందుబాటులో లేరని సీబీఐ తరఫు న్యాయవాదులు చెప్పడంతో జస్టిస్ ఖన్నా ఆగ్రహం వ్యక్తంచేశారు. సీబీఐ అఫిడవిట్‌లోని అంశాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని తెలిపారు. కోర్టుల ఆదేశాలు తప్పనే సాకుతో కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము కూడా అనేక పిటిషన్లు విచారించి డిశ్చార్జ్ చేస్తున్నామని.. తమకెలాంటి అవరోధాలు ఎదురు కావడం లేదని ధర్మాసనం తెలిపింది. డిశ్చార్జ్ పిటిషన్లకు, కేసు విచారణకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం విచారణ చేపట్టాలని సీబీఐని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబరు 11కు వాయిదా వేసింది.

జగన్‌కు 'జెడ్ ప్లస్' భద్రత కల్పిస్తున్నాం: ఏజీ

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ భద్రతను కుదించలేదని, ఆయనకు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పిస్తున్నామని అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. బులెట్ ప్రూఫ్ వాహనానికి విండ్ షీల్డ్ అమర్చడం పూర్తయ్యేవరకు మరో బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి ఈ వ్యవహారంపై పూర్తివివరాలతో కౌంటర్ వేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించారు. విచారణన 28కి వాయిదా వేశారు. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి బుధవారం ఆదేశాలిచ్చారు. సీఎం హోదాలో తనకున్న భద్రతను పునరుద్ధరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మాజీ సీఎం జగన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్. శ్రీరామ్ వాదనలు వినిపించారు. పిటిషనర్‌కు ఇచ్చిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం అద్దంలో పగుళ్లు ఉన్నాయని, వెనుక తలుపు తెరుచుకోవడం లేదని వివరించారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ... మాజీ ప్రధానులకు కల్పిస్తున్న భద్రత మాదిరిగానే మాజీ సీఎంలకు కూడా కల్పించే విషయాన్ని ప్రభుత్వం ఎందుకు పరిశీలించకూడదని ప్రశ్నించారు. ఏజీ దమ్మాలపాటి బదులిస్తూ... తీవ్రవాదుల ముప్పు ఉండటంతో ఎస్‌పీజీతో భద్రత కల్పించారని, మాజీ సీఎంలకు భద్రత కల్పించే విషయంలో హోంశాఖ మార్గదర్శకాలు అనుసరిస్తున్నామని పేర్కొన్నారు. 2024 జూన్ 3నాటి భద్రత కల్పించాలని పిటిషనర్ కోరుతున్నారని, అప్పుడు ఆయన సీఎం అన్నారు. ప్రస్తుతం ఆ హోదాలో లేరని తెలిపారు. జగన్‌కు ఇచ్చిన బులెట్ ప్రూఫ్ వాహనానికి విండ్‌షీల్డ్ మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారని, త్వరలోనే మరమ్మతులు పూర్తిచేస్తారని చెప్పారు. అంతవరకూ జగన్‌కు కొత్త బులెట్ ప్రూఫ్ వాహనం సమకూరుస్తారని వెల్లడించారు. పిటిషనర్ తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో, రిమోట్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్‌లు ఉపయోగించే ప్రాంతాల్లో పర్యటించే సమయంలో కాన్వాయ్‌లో జామర్ ఏర్పాటు చేస్తామని, ఆ వివరాలను ఆయన భద్రతా సిబ్బందికి అందిస్తామని అన్నారు. వ్యాజ్యంపై విచారణ ముగిసిన అనంతరం జగన్ తరఫు సీనియర్ న్యాయవాది స్పందిస్తూ... ప్రమాదం ఎప్పుడెలా వస్తుందో ఎవరికీ తెలియదంటూ... బంగ్లాదేశ్‌లో జరిగిన ఘటనను ఉదహరించారు. న్యాయమూర్తి స్పందిస్తూ మన దేశంలో అలాంటి ఘటనలు జరిగవని తనకు పూర్తి నమ్మకం ఉందని పేర్కొన్నారు.



హోం మంత్రి అనితతో భేటీ అయిన వివేకానంద రెడ్డి కుమార్తె సునీత

నా తండ్రి కేసులో న్యాయం చేయండి

- ›› కూటమి సర్కారుకు వివేకా కుమార్తె విన్నపం
- ›› హోం మంత్రి అనితను కలిసిన నర్రెడ్డి సునీత

అమరావతి/కడప, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): "నా తండ్రి హత్య కేసులో నాకు న్యాయం జరగలేదు. దోషులకు శిక్ష పడేలా నేను చేస్తున్న న్యాయ పోరాటానికి మీ సహకారం కావాలి. ఒక మహిళా మంత్రిగా నా బాధ అర్థం చేసుకోండి" అంటూ హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను వైఎస్ వివేకానంద రెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత కోరారు. అమరావతి సచివాలయంలో బుధవారం సీఎం చంద్రబాబును కలిసేందుకు వచ్చిన సునీత.. ఆయన బిజీగా ఉండటంతో హోం మంత్రి అనితను కలిశారు. "మా నాన్న(వివేకా) చాలా మంచి వ్యక్తి. గొడ్డలితో నరికి చంపి గుండెపోటని చిత్రీకరించారు. దోషులకు శిక్ష పడటమే మా నాన్నకు అసలైన నివాళి. నా వేదన అర్థం చేసుకుని న్యాయ పోరాటానికి సహకరించండి" అని సునీత కోరారు. పోలీసులు కేసును నీరుగార్చేలా వ్యవహరించారని, నిందితులను అరెస్టు చేసేందుకు కర్నూలుకు వెళ్లిన సీబీఐ అధికారుల బృందానికి స్థానిక పోలీసులు సహకరించకుండా అప్పటి ప్రభుత్వ పెద్దలు ఆదేశాలు జారీ చేశారని వివరించినట్లు తెలిసింది. ఆమె విన్నపంపై స్పందించిన హోంమంత్రి అనిత.. "కేసు ఇప్పుడు సీబీఐ పరిధిలో ఉంది. మీకు న్యాయం జరిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం కావాలన్నా అందిస్తాం" అని బదులిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర పోలీసులు హంతకులకు అండగా నిలిచారని, బాధితులకు న్యాయం చెయ్యకపోగా సీబీఐ దర్యాప్తు అధికారులపై కేసులు పెట్టారని సునీత తెలిపారు. అలాంటి పోలీసులపై చర్యలు తీసుకుని భవిష్యత్తులో పోలీసులు ఎవరూ ఇలాంటి అక్రమాలకు పాల్పడకుండా చూడాలని విన్నవించారు. "సాక్షుల్ని బెదిరించారు. నన్ను ఇబ్బంది పెట్టారు. అవమానించారు. కేసులు పెట్టారు. ఎన్ని అరాచకాలు చేశారో చెప్పలేను" అంటూ సునీత ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా హత్య కేసులో తప్పు చేసిన పోలీసులతోపాటు హంతకులకు వంత పాడిన వారిపైనా చర్యలు తీసుకుంటామని అనిత స్పష్టం చేశారు.

కేసును తప్పుదోవ పట్టించారు

హోం మంత్రిని కలిసిన తర్వాత వివేకా కుమార్తె సునీత బుధవారం సాయంత్రం కడప జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలిశారు. హత్య కేసును తప్పుదోవ పట్టించేందుకు సీబీఐ అధికారులను బెదిరించడం, వారిపై కేసులు పెట్టడం వంటి అంశాలను వివరించినట్లు తెలిసింది. అధికారాన్ని అడ్డంపెట్టుకుని కేసులు, పిటిషన్లు వేస్తూ కేసును నీరు గార్చేందుకు ప్రయత్నించారని వివరించినట్లు సమాచారం. ఐదేళ్లు అధికారంలో ఉన్నది సొంత కుటుంబ సభ్యులే అయినా న్యాయం జరగలేదని అన్నారు. తప్పు చేసిన పోలీసులను వదిలి పెట్టొద్దని ఎస్పీ హర్షవర్ధన్‌రాజును ఆమె కోరినట్లు తెలిసింది.

నేతన్నలకు అండగా ఉంటాం

- ›› చేనేత వస్త్రంపై జీఎస్టీ రద్దు చేయిస్తా
- ›› జాతీయ చేనేత దినోత్సవంలో చంద్రబాబు



అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల ఆదాయం పెరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నేతన్నల జీవితాల్లో వెలుగులు వచ్చేవరకూ తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విజయవాడలో ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికుల కష్టాలు, మార్కెటింగ్‌లో ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. నేతన్నలకు ఏదీ ఇవ్వకుండా అన్నీ చేశానంటూ సాక్షి పత్రిక, టీవీలో 400 కోట్ల ప్రకటనలు ఇచ్చుకున్న జగన్ రెడ్డి, చేనేత రంగంపై 226 కోట్లు అప్పు పెట్టి వెళ్లారని అన్నారు. ఆప్కోలో కొనుగోళ్లు ఆపేశారని, సొంత మగ్గానికి మాత్రమే నేతన్న నేస్తం ఇచ్చి లక్షలాది మందికి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కులవృత్తులే ఆస్తిపాస్తులుగా జీవిస్తున్న వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం ఐదేళ్లలో 1.50 లక్షల కోట్లు ఖర్చు చేయబోతోందన్నారు. బీసీల రక్షణ కోసం తమ ప్రభుత్వం చట్టం తీసుకురాబోతోందని, చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం పార్లమెంటులో పోరాటం చేస్తామని తెలిపారు. చేనేతలు అడిగిన దానికన్నా ఎక్కువే ఇవ్వాలని ఉన్నా.. ఖాళీ ఖజానా, పది లక్షల కోట్ల అప్పులు, ఏడాదికి 90 వేల కోట్ల వడ్డీలు తన ముందున్న పెద్ద సవాళ్లన్నారు. 16 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామన్నారు. ఇసుక ఉచితంగా ఇచ్చి భవన నిర్మాణ కార్మికులకు పని కల్పించామని, మరోవైపు సామాన్యుడు ఇల్లు నిర్మించుకోవడానికి సులభతరం చేశామని చెప్పారు. ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామని, పేదోడికి అండగా తెలుగుదేశం పార్టీ, ఎన్డీయే ప్రభుత్వం ఉంటాయని భరోసా ఇచ్చారు.

చేనేతలకు ఆరోగ్య బీమా

'చేనేత వర్గాలకు ఆరోగ్య బీమా చేయిస్తాం. త్రిఫ్ట్ ఫండ్ ప్రభుత్వ వాటా 8శాతం నుంచి 16 శాతానికి పెంచుతాం. జీఎస్టీ కౌన్సిల్‌తో మాట్లాడి చేనేత వస్త్రంపై పన్ను రద్దు చేయిస్తా. కుదరకపోతే రీయింబర్స్‌మెంట్ ఇస్తా. టీడీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా చేనేతలు ఉన్న ప్రాంతాల్లో పార్టీ పెట్టినప్పటి నుంచి మెజారిటీ వస్తూనే ఉంది. ఇంతలా ఆదరించిన మిమ్మల్ని గుండెల్లో పెట్టుకుంటా. మీకు ఎంతచేసినా తక్కువే. ఇంట్లో మగ్గం కోసం ఆర్థిక చేయూత ఇస్తాం. ఆన్‌లైన్ వ్యాపారానికి సహకారం అందిస్తాం. ప్రధాని సూర్యఘర్ కింద 200 యూనిట్లు విద్యుత్ సొంతంగా వాడుకునేలా సోలార్ ఏర్పాటు చేయిస్తాం' అని ముఖ్యమంత్రి వరాలు కురిపించారు. ఏడాదికి 60-70 కోట్ల జీఎస్టీ భరించేందుకు మనసు రాని మాజీ ముఖ్యమంత్రి సర్వే రాళ్లపై ఫొటోలకు 700 కోట్లు, సొంత మీడియాకు 400 కోట్లు ఇచ్చుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావ్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప పాల్గొన్నారు.

భువనేశ్వరి కోసం ఉప్పాడ, ధర్మవరం చీరలు

›› చేనేత స్టాల్స్‌లో కొన్న చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు తన సతీమణి కోసం షాపింగ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విజయవాడలో ఏర్పాటు చేసిన చేనేత స్టాల్స్‌లో నారా భువనేశ్వరి కోసం చీరలు కొనుగోలు చేశారు. చేనేత స్టాళ్లను తిలకిస్తూ ముందుకెళ్లిన ముఖ్యమంత్రి రెండు స్టాల్స్ వెనక్కి వచ్చి 'ఈ చీరలు బాగున్నాయి.. ఎక్కడివి?' అని అడిగారు. ఉప్పాడ హ్యాండ్లూమ్ సొసైటీలో తయారైనవని అక్కడున్న నేత కార్మికుడు మల్లెల నాగేంద్రబాబు చెప్పారు. 'సరే ఆ చీర ఇవ్వు' అంటూ నెమలి రంగు పట్టు చీరను కొనుగోలు చేశారు. ఆ తర్వాత ధర్మవరం పట్టుచీరల స్టాల్‌కు వెళ్లి మరో చీర కొనుగోలు చేశారు. 'నా జీవితంలో ఎప్పుడూ చీరలు కొనలేదు. ఇప్పుడు మన చేనేత కళాకారులు తయారు చేసిన చీరలు చూడగానే ఆకట్టుకున్నాయి. అందుకే మా ఆవిడకు రెండు చీరలు కొనుగోలు చేశా. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు కొనాలి. నెలలో ఒక్క రోజైనా చేనేత వస్త్రాన్ని తప్పక ధరించాలి' అని ముఖ్యమంత్రి అన్నారు.

బటన్‌రెడ్డికి బటన్ నొక్కి బుద్ధి చెప్పారు

›› చేనేత దినోత్సవంలో మంత్రి సవిత

బాపట్ల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి), మంగళగిరి సిటీ: రాష్ట్రాన్ని ఇప్పుడు కాపాడుకోకపోతే భావితరాల భవిష్యత్తుకు తామే ఉరివేసిన వాళ్లమవుతామన్న ఆలోచనతోనే జగన్‌రెడ్డికి వ్యతిరేకంగా బటన్ నొక్కి ప్రజలు బుద్ధి చెప్పారని చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. బాపట్ల జిల్లా చీరాలలో బుధవారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చీరాల కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరుకావాల్సి ఉందని, అయితే.. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రాలేకపోయారని తెలిపారు. 2014-19 మధ్య చేనేత రంగానికి స్వర్ణయుగం లాంటిదని, గడచిన ఐదేళ్లలో దాచుకోవడం, దోచుకోవడం తప్ప జగన్ ఏమీ చేయలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో చేనేత కార్మికులను ఆదుకోకపోగా వారి భూములను సైతం లాక్కున్నారని విమర్శించారు. వారు చేసిన భూ కబ్జాలకు ప్రొద్దుటూరులో కుటుంబం మొత్తం ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. గతంలో నూలుపై ఇచ్చిన సబ్సిడీని పునరుద్ధరించడంతో పాటు ఆప్కో ద్వారా రాయితీలు, ఆదరణ పథకాలు, నేత కార్మికులకు పెన్షన్, బీమా సౌకర్యం లాంటివన్నీ అమలు చేస్తామని మంత్రి చెప్పారు.



చీరాలలో నేత కార్మికుడి ఇంట్లోకి వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి సవిత

చేనేత దినోత్సవంలో మాట్లాడిన మంత్రి సవిత ఓ దశలో భావోద్వేగానికి గురయ్యారు. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన తనకు మంత్రి పదవి ఇచ్చేటప్పుడు.. "నా కుటుంబ సభ్యులైన చేనేతలను మీ చేతిలో పెడుతున్నా" అని మంత్రి లోకేశ్ చెప్పారని పేర్కొంటూ సవిత భావోద్వేగానికి లోనయ్యారు.

వైసీపీ అనుకూల పత్రికలో చేనేత రంగంపై బుధవారం ప్రచురితమైన ఓ కథనాన్ని సభలోనే చూపిస్తూ విషపు రాతలపై విరుచుకుపడ్డారు. కాగా, షెడ్యూల్ ప్రకారం చీరాల జాండ్రపేటలోని 3 చేనేత కుటుంబాలను సీఎం చంద్రబాబు కలుసుకోవాల్సి ఉంది. అననుకూల వాతావరణంతో రాలేకపోయారు. ఆ ఇళ్లకు మంత్రి సవిత వెళ్లా రు. జాండ్రపేటలోని వెంకటనాగేశ్వరరావు, నాగ య్య, యారంబరావు ఇళ్లకెళ్లి వారి ఇక్కట్లు తెలుసుకున్నారు.

'నేతన్న నేస్తం'లో అక్రమాలు

›› మంత్రి సత్యకుమార్

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన చేనేత పరిశ్రమకు కూటమి ప్రభుత్వ హయాంలో పూర్వవైభవం తీసుకువస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో బుధవారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. 'నేతన్న నేస్తం'లో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. చేనేత వృత్తితో ఏమాత్రం సంబంధంలేని వైసీపీ కార్యకర్తలకు నేతన్న నేస్తం ఇచ్చారని ఆరోపించారు. వైసీపీ పాలనలో వందలాది మంది చేనేత కార్మికులు హత్యలు, ఆత్మహత్యలు, ఆకలి చావులకు గురయ్యారని ఆరోపించారు. వాటన్నింటినీ వైసీపీ ప్రభుత్వ హత్యలుగానే భావించాల్సి ఉంటుందన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం అధికారులు, మినిస్ట్రీ ఆఫ్ కన్స్యూమర్ అఫైర్స్ అధికారులు

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై పరిశోధనలు

● వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి

లాంఫాం (తాడికొండ) ఆగస్టు 7: ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఇండియన్ స్టాండర్డ్స్ ప్రకారం ఆధునిక వ్యవసాయ పద్ధతులపై పరిశోధనలు నిర్వహిస్తుందని వీసీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి తెలిపారు. బుధవారం లాంఫాంలోని ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో ఎన్.జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, బ్యూర్ ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, మినిస్ట్రీ ఆఫ్ కన్స్యూమర్ అఫైర్స్, ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ వారి మధ్య డెవలప్‌మెంట్ ఆఫ్ స్టాండర్డ్స్ డైజెడ్ అగ్రికల్చర్ డెమెనిస్ట్రేషన్ ఫార్మ్స్ కోసం అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ అగ్రికల్చర్ డెమోనిస్ట్రేషన్ ఫార్మ్స్‌గా తయారు చేసి వ్యవసాయ పనిముట్లు, నీటి యాజమాన్యం, పురుగులు తెగుళ్ల, పోషకాల యాజమాన్యం ఇండియన్ స్టాండర్డ్స్ ప్రకారం డెమోనిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. ఈ ఫార్మ్స్‌ని వివిధ స్టాక్ హోల్డర్స్‌కి ఆధునిక వ్యవసాయ విధానాలను బోధించడానికి శిక్షణ ఇవ్వటానికి ఉపయోగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బ్యూర్ ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ఎం.ఏ.జే వినోద్, సీనియర్ డైరెక్టర్, హెడ్ శ్రీకృష్ణవీర్‌వర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ జీ.రామచంద్రరావు, డీన్ డాక్టర్ జీ.కరుణాసాగర్, డీన్ ఆఫ్ కమ్యూనిటి సైన్స్ డాక్టర్ బీ. శ్రీలక్ష్మీ, డీన్ పీజీ స్టడీస్ డాక్టర్ ఏ.వీ.రమణ, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీ.వీ.సత్యనారాయణ, డాక్టర్ బీవీఎస్ ప్రసాద్, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గం

● అధ్యక్షుడిగా సీహెచ్ సాంబశివరావు ఎన్నిక

పెదకాకాని, ఆగస్టు 7: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో బీసీ ఉద్యోగుల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్. సాంబశివరావు, కార్యదర్శిగా ఐ.సాయిరాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా డీ.వీరాంజనేయులు, సూర్యకుమారి, కోశాధికారిగా విద్యాసాగర్, జాయింట్ సెక్రటరీగా ఎస్.శ్రీనివాస్, ఎస్‌కే దరియా, కార్యవర్గ సభ్యులను ఎనునకున్నారు. ఈ కార్యవర్గానికి గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రొఫెసర్ త్రిమూర్తిరావు మాట్లాడుతూ బీసీ ఉద్యోగులంతా ఐక్యంగా తమ హక్కులను సాధించుకునే దిశగా పనిచేయాలని, అందుకు తనవంతు కృషిని అందిస్తానని చేస్తానని హామీ ఇచ్చారు. అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్. సాంబశివరావు, ఐ.సాయిరాంలు మాట్లాడుతూ బీసీ ఉద్యోగుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేస్తానని, బీసీ ఉద్యోగులకు అందుబాటులో ఉండి వారి పదోన్నతులు బదిలీల విషయంలో జరుగుతున్న అన్యాయంపై న్యాయపోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో డీరామాంజనేయులు, సూర్య కామేశ్వరి, విద్యాసాగర్ శ్రీనివాస్, ఎస్‌కే దరియా, పూలే కేంద్రం ప్రోగ్రామర్ బీ.కోటియాదవ్, వాసుదేవ్ పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

● 22వ రోజు అధిక సంఖ్యలో హాజరైన ప్రజలు
● భూ కబ్జాలపై భారీగా అర్జీలు
● పరిశీలించి పరిష్కరిస్తానని మంత్రి లోకేశ్ హామీ

తాడేపల్లి, ఆగస్టు 7: నారా లోకేశ్ ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌కు బుధవారం 22వ రోజు జోరువానలోనూ కొనసాగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు ఉండవల్లి కరకట్ట వద్దకు విచ్చేసి యువనేత, మంత్రి నారా లోకేశ్‌ను కలిసి సమస్యలు విన్నవించి పరిష్కరించాలంటూ వినతిపత్రాలు అందించారు.

మంగళగిరి 17వవార్డుకు చెందిన ఓసూరు వెంకయ్య లోకేశ్‌ను కలిసి గౌతమబుద్ధా రోడ్డులో నివాసం ఉండే తన ఇంటిని గత వైసీపీ ప్రభుత్వం రోడ్డు వెడల్పు పేరుతో తన ఇంటిని సగ భాగం కూల్చిందని నష్టపరిహారం ఇవ్వలేదని అనుమతి లేకుండా అక్కడ విద్యుత్ టాన్స్‌ఫార్మ్ సైతం ఏర్పాటు చేశారని బోరుమ న్నారు. సమస్య పరిష్కరిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు.

ఏలూరు జిల్లా, పొంగుటూరు గ్రామానికి చెందిన పసుపులేటి శ్రీను లోకేశ్‌ను కలిసి జాతీయ రహదారి కోసం సేకరించిన తన మూడు ఎకరాల భూమికి తక్కువ పరిహారం అందించారని మార్కెట్ విలువ ప్రకారం నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. సమస్య విన్న మంత్రి లోకేశ్ పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.





వినతి పత్రాలు స్వీకరిస్తున్న నారా లోకేశ్

తాడేపల్లి, తెనాలి మున్సిపాలిటి పరిధిలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద పూర్తి చేసిన సివిల్ పనులకు గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్రంగా నష్టపోయానని మంగళగిరికి చెందిన ఆర్.అశోక్ బాబు అనే కాంట్రాక్టర్ మంత్రి లోకేశ్‌కు వివరించారు. పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. బిల్లులు మంజూరు చేయించాలని విజ్ఞప్తిచేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని మంత్రిలోకేశ్ హామీ ఇచ్చారు.

పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన తన మూడు ఎకరాల అసైన్డ్ భూమిని గత వైసీపీ ప్రభుత్వ అండతో కబ్జాచేశారని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంకు చెందిన గుంటి రాము మంత్రి లోకేశ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తప్పుడు పత్రాలతో తమ భూమిని ఇతరుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారని, ప్రశ్నించిన తమపై దాడిచేసి భయభ్రాం తులకు గురిచేస్తున్నారని కన్నీటిపర్యంతమ య్యారు.

సీఆర్‌డీఏ రైతుకూలీ పెన్షన్ అందించి ఆదుకోవాలని మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లి ఎస్సీ కాలనీకి చెందిన చెందిన జే ప్రియాంక, తన ఇద్దరు కుమార్తెలకు ఉద్యోగం కల్పించడంతో పాటు టిడ్కో ఇంటిని మంజూరు చేసి ఆదుకోవాలని ఉండవల్లికి చెందిన శిఖా శేఖర్‌బాబు, ఇంటి స్థలం మంజూరు చేయాలని చినకాకానికి చెందిన కే.ధనరాజ్, ఉద్యోగ అవకాశం కల్పించాలని అనకాపల్లి జిల్లా బోయలకింతాడ గ్రామానికి చెందిన డీవీఎల్ఎన్ మూర్తి, పలువురు తమ సమస్యలను మంత్రి నారా లోకేశ్ విన్నవించారు. ఆయా సమస్యలను పరిశీలించి, పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.



బాధితుల గోడు ఆలకిస్తున్న మంత్రి నారా లోకేశ్

రేపు హెచ్‌సీఎల్ ఐటీ శిక్షణకు

ఇంటర్ విద్యార్థుల ఎంపికలు

గుంటూరు(విద్య),ఆగస్టు 7: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్ బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులతో పూర్తిచేసిన వారికి ఐటీ శిక్షణ ఇవ్వనున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి పీ.ప్రణయ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు ఈనెల 9న ప్రభుత్వ ఐటీఐ కళాశాల (గుంటూరు కలెక్టరేట్ ఎదుట) క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 2023, 2024 విద్యాసంవత్సరాల్లో 75 శాతం మార్కులతో ఇంటర్ (బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ) పూర్తి చేసి ఉండాలని సూచించారు. ఆసక్తి ఉన్నవారు తమ బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్స్, జిరాక్స్, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఇంటర్వ్యూలకుహాజరుకావాలని సూచించారు. హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ, రాత పరీక్ష ద్వారా ఐటీ శిక్షణకు ఎంపిక చేస్తామని, ఇతర వివరాల కోసం మణిదీప్ (8074607278) సంప్రదించాలని సూచించారు.

నేడు జాబ్ మేళా

గుంటూరు(విద్య),ఆగస్టు7 : గుంటూరు జిల్లా ఉపాధి కార్యాలయంలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి కే.రఘు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ నుంచి డిగ్రీ, పీజీ, బీటెక్ పూర్తిచేసి 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయసు ఉన్న అభ్యర్థులు ఇందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు గుజ్జనగుండ్లలోని జిల్లా ఉపాధి కార్యాలయం (కావూరి కాంప్లెక్స్)లో జరిగే ఇంటర్వ్యూలకు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాల కోసం 98668 22697లో సంప్రదించాలని కే.రఘు కోరారు.

యువతకు స్వయం ఉపాధి శిక్షణ

గుంటూరు (విద్య), ఆగస్టు 7: యూనియన్ బ్యాంకు గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు రిఫ్రిజరేషన్, ఏసీ సర్వీసింగ్, కంప్యూటర్ ట్యాలీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ బీజీ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు ఈ శిక్షణ పొందుటకు అర్హులని, శిక్షణతోపాటు వసతి, భోజన సౌకర్యం అందిస్తామని తెలి పారు. అభ్యర్థులు పది పాస్ లేదా ఫెయిల్ అయి ఉండి, 19 నుంచి 45 సంవత్సరాలు వయసు ఉన్న వారు అర్హులని తెలిపారు. అభ్య ర్థులు తెల్లరేషన్ కార్డు, ఆధార్, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో యూనియన్ బ్యాంకు గ్రామీణాభివృద్ధి సంస్థ, డోర్‌నం.14-1-14, ఓల్డ్ బ్యాంకు స్ట్రీట్, కొత్తపేట, గుంటూరు (సెల్ : 9700687696, 8125397953) దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

13న పెన్షన్ అదాలత్

గుంటూరు(విద్య),ఆగస్టు 7: ఈనెల 13న కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని భవిష్యనిధి పెన్షనర్ల ఫిర్యాదుల పరిష్కారం కోసం పెన్షన్ అదాలత్ నిర్వహిస్తునట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్‌ఘోష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలు ఆన్‌లైన్, మెయిల్, వెబ్‌నార్, పోస్టు ద్వారా తమ ఫిర్యాదులు, సమస్యలు పంపవచ్చునని వెల్లడించారు. కార్యాలయ ఈమెయిల్ ro.guntur@epfindia.gov.in వాట్సప్ నం. 949465 7469, ఫొన్ 0863-2344106,0863,2232921, వెబ్ ఎక్స్ ఐడీ 2644 636 3676, పాస్ కోడ్ epfo@1234 ద్వారా పంపాలని సూచించారు.



అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్

● చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు
● క్యాంటీన్ల వద్ద ఆధునికీకరణ పనుల పరిశీలన

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 7 : కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిచనున్న అన్నక్యాంటీన్‌లు పేదల ఆకలి తీర్చనున్నాయని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని గడియారస్తంభం, ఎన్టీఆర్‌సెంటర్, అడ్డరోడ్డు వద్దగల అన్నక్యాంటీన్‌లను సదర్శించి జరుగుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రజలు ఆకలి ఎలా తీర్చాలన్న సంకల్పంతో చంద్రబాబు అన్నా క్యాంటీన్‌లు ప్రారంభిస్తే, ప్రజల ఆస్తులు దోచుకోవాలనే దుర్బుద్ధితో జగన్ పనిచేశాడని అన్నారు. అందుకే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్, పాసు బుక్‌లు, సర్వే రాళ్ళ పై తన బొమ్మలు వంటి వికృత చర్యలకు పూనుకున్నాడని దుయ్యబట్టారు. గతంలో ఇచ్చిన హామి మేరకు ఆగస్టు 15న రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్‌లు పునఃప్రారంభం కానున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చేవరకు చిలకలూరిపేటలో సొంత నిధులతో రెండు అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేసి పేదల కడుపు నింపిన విషయాన్ని గుర్తుచేశారు. ఒక పట్టణంలో మూడు అన్నక్యాంటీన్‌లు ఏర్పాటు చేయటం చాలా అరుదని, అలాంటిది తాను మంత్రిగా ఉన్న సమయంలో చిలకలూరిపేటలో మూడు అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేశామన్నారు.

జీవన ప్రమాణ పత్రాలు సమర్పించాలి

● పెన్షన్‌దారులను కోరిన పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ ఇంద్రనీల్‌ఘోష్

గుంటూరు (విద్య), ఆగస్టు 7: జిల్లాలోని పెన్షన్‌దారులు (ఈపీఎస్, ఎఫ్‌పీఎస్) తమ జీవన పత్రాలను నిర్ధేశించిన మార్గాల ద్వారా విధిగా సమర్పించాలని పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ ఇంద్రనీల్‌ఘోష్ బుధవారం ఒక ప్రకటనల పేర్కొన్నారు. పెన్షన్ తీసుకునే బ్యాంకు లేదా పీఎఫ్ కార్యాలయం, మీసేవా, పోస్టు ఇన్ఫో యాప్, ఆండ్రాయిడ్ ఫోన్‌లోని ఆధార్‌ఫెస్ యాప్ ద్వారా జీవన ప్రమాణ పత్రాలు పంపాలని సూచించారు. పెన్షన్‌దారులు తమ అభ్యర్థన తెలియజేస్తే పోస్టుమ్యాన్ ఇంటికి వచ్చి వేలుముద్ర, ఐరిష్ ద్వారా జీవన ప్రమాణ పత్రాలు స్వీకరిస్తారని తెలిపారు. ఇతర వివరాల కోసం గుంటూరు నగరంలోని కృష్ణనగర్ వద్ద గల ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ కార్యాలయంలో సంప్రదించాలని పెన్షన్ దారులకు సూచించారు.

పిడుగురాళ్లలో చెన్నై షాపింగ్‌మాల్

● ప్రారంభించిన సినీనటి అనుపమా పరమేశ్వర్

పిడుగురాళ్ల, ఆగస్టు7: పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలో అధునాతన హంగులతో సరికొత్తగా రూపుదిద్దుకున్న చెన్నైషాపింగ్ మాల్‌ను బుధవారం సినీనటి అనుపమా పరమేశ్వర్, యాజమాన్యం ప్రారంభించారు. ఇది తెలుగు రాష్ట్రాల్లో 18వ షాపింగ్‌మాల్. నూతన వస్త్రాలు అన్నివర్గాల వారికి అందుబాటు ధరల్లో వుండటంతో మొదటిరోజే కొనుగోలుదారులు కిక్కిరిసిపోయారు. వస్త్రాల కొనుగోలుపై ఆఫర్‌లు ప్రకటించడంతో మాల్ ముందు ప్రజలు బారులుతీరారు. వెరైటీ డిజైన్‌లు, ఉమెన్స్‌వేర్, కిడ్స్‌వేర్, మెన్స్‌వేర్‌లు ఆకట్టు కునేలా ఉన్నాయంటూ కొనుగోలుదారులు క్యూకట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెన్నైషాపింగ్ మాల్‌ని సందర్శించారు. పిడుగురాళ్లలో అతిపెద్ద షాపింగ్‌మాల్‌ను ఏర్పాటు చేసిన యాజమాన్యాన్ని ఆయన అభినందించారు.



షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో సినీనటి అనుపమ పరమేశ్వర్



పిడుగురాళ్ల చెన్నై షాపింగ్ మాల్‌లో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

ఏఎన్‌యూ యూజీసీ ఇన్‌చార్జికో-ఆర్డినేటర్‌గా

ప్రొఫెసర్ వై. అశోక్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

పెదకాకాని, ఆగస్టు 7 : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ యూజీసీ విభాగం ఇన్‌చార్జి కో-ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ వై.అశోక్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఏఎన్‌యూ యూజీసీ కోఆర్డినేటర్ కార్యాలయంలో మాజీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఏ. కృష్ణసత్య నుంచి అశోక్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జీ.సింహాచలం అశోక్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ యూజీసీ, యూనివర్సిటీ మధ్య అనుసంధానకర్తగా ఉంటూ విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేసి వర్సిటీ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతానన్నారు. అనంతరం అశోక్ కుమార్‌కు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.వెంకటేశ్వర్లు, సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఎం.త్రిమూర్తిరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్. స్వరూపరాణి, దూరవిద్య కేంద్రం పరీక్షల కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ డీ.రామచంద్రన్, యూజీసీ మాజీ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ రత్నాకర్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఆర్‌వీఎస్ఎస్ ఎన్.రవికుమార్, తదితరులు అశోక్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ చైర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అబ్రహం లింకన్ డాక్టర్‌గోపీకృష్ణ, ఉద్యోగులు ఎం.రాధాకృష్ణ, అతిథి అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99,110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

ఎంబీబీఎస్ సీట్లు పెంచకుండా

ఈడబ్ల్యూఎస్ రిజర్వేన్లు అమలు తగదు

గుంటూరు(విద్య),ఆగస్టు 7: ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లు అమ్ముకునేందుకు అనుకూలంగా తీసుకువచ్చిన జీవో 107, 108 రద్దు చేయాలని, సీట్లు పెంచకుండా ఓసీ సీట్లలో కోత విధించి ఈడబ్ల్యూఎస్ అమలు చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ (ఏపీఎంపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం వైద్య కళాశాలల్లో ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ అమలు చేస్తే బీసీ ,ఎస్టీ, ఎస్సీ, ఓసీ జనరల్ విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పుడున్న వివిధ కేటగిరి సీట్లు తగ్గించకుండా సీట్లు పెంచిన తర్వాతే ఈడబ్ల్యుఎస్ అమలు చేయాలని కోరారు. తాము ఇడబ్ల్యుఎస్‌కు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. మెడికల్ కళాశాలల్లో సీట్లు పెంచిన తర్వాతే దీనిని అమలు చేయాలని కోరారు.



రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి వీసీ, తదితరులు

ప్రపంచం గర్వించే కవి రవీంద్రనాథ్ ఠాగూర్

పెదకాకాని, ఆగస్టు 7 : భారతదేశానికి నోబెల్ బహుమతి తీసుకువచ్చిన రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రపంచం గర్వించే కవి అని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు అన్నారు. బుధవారం ఠాగూర్ 83వ వర్ధంతిని పురస్కరించుకొని యూనివర్సిటీలోని ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ కవిగా సాంఘిక సంస్కర్తగా, స్వరకర్తగా నాటక రచయితగా ఆయన భారతీయులలో భావోద్వేగాలను రేకెత్తించారని అన్నారు. విద్యార్థులు తమ లక్ష్య సాధనలో ఠాగూర్ వంటి మేధావులను ఆదర్శప్రాయంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జీ.సింహాచలం, సీడీసీ ఇన్‌చార్జి డీన్ ప్రొఫెసర్ వీ.రవికుమార్, సీఎస్ఆర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్వీ రమణ, యూనివర్సిటీ ఇంజనీర్ డీఏ. కుమార్‌రాజు, ఉద్యోగులు, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బీ.హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.



ప్రదర్శనలో వైద్యులు గూడూరు సీతామహాలక్ష్మీ, దివ్య తేజోమూర్తి, రమణ యశస్వీ

అవయవదానంపై అవగాహన పెంచాలి

● అఖిల భారత శరీర, అవయవ దాతల సంఘ అధ్యక్షురాలు సీతామహాలక్ష్మి

మంగళగిరిసిటీ, ఆగస్టు 7: అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెంచాలని అఖిల భారత శరీర అవయవదాతల సంఘం అధ్యక్షురాలు, సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి పిలుపునిచ్చారు. ఆగస్టు 1 నుంచి 15 వరకు జరుగనున్న జాతీయ అవయవదాన పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. జాతీయ సేవా పథకం, అవయవ దాతల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పీ.దివ్య తేజోమూర్తి ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్లకార్డులను చేతబూని 'అమ్మ జన్మనిస్తుంది-అవయవ దానం పునర్జన్మనిస్తుంది, అవయవ దానం చేయండి-ప్రాణదాతలు కండి, అవయవ దానం చేయండి- ఎనిమిది మంది జీవితాల్లో వెలుగులు నింపండి' అంటూ నినదాలు చేశారు. ఆత్మకూరు జంక్షన్‌వరకు ప్రదర్శ నిర్వహించి అక్కడ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏర్పాటుచేసిన అవగాహనా సదస్సులో డాక్టర్ సీతామహాలక్ష్మీ మాట్లాడుతూ.. అవయవదానం వలన మనిషికి పునర్జన్మ లభించినట్లవుతుందన్నారు. యువత సామాజిక దృక్పథం కలిగివుండి, అవయవ దానంపై సమాజాన్ని చైతన్య పరిచేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. అవయవ దానంపై విద్యార్థులకు పోస్టర్ మేకింగ్ కాంపిటీషన్ నిర్వహించగా, అందె భాగ్యశ్రీ ప్రథమ బహుమతి, ఎం.భార్గవి ప్రియ ద్వితీయ బహుమతులను సాధించారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో శరీర అవయవ దాతల సంఘం ప్రతినిధులు డాక్టర్ రమణ యశస్వి, కొండవీటి నర్మద, నిర్మల ఫార్మసీ కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ జీ.నిర్మల జ్యోతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రేఖా నరేష్‌బాబు, ఆర్.నరసింహా నాయక్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కళ్ళం మోహనరెడ్డి, ఉమాశంకరరెడ్డి తదితరులు

అత్యున్నత ప్రమాణాలతో సాంకేతిక విద్య

● కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాకర్ ఎం ఉమాశంకరరెడ్డి

గుంటూరు (విద్య), ఆగస్టు 7: సాంకేతిక విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో విద్యా బోధన, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పన తమ ధ్యేయమని కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ మువ్వా ఉమాశంకరరెడ్డి అన్నారు. బుధవారం చౌడవరంలోని కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమాశంకరరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ఈ ఏడాది 1200 మందికి పైగా విద్యార్థులు ఇంజనీరింగ్‌లో అడ్మిషన్ పొందారని తెలిపారు. వీరికి మెరుగైన బోధన, మౌలిక వసతులు అందిస్తున్నామని వివరించారు. కళాశాల చైర్మన్ కళ్ళం మోహనరెడ్డి ప్రసంగిస్తూ విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయంగా కళాశాల పనిచేస్తుందన్నారు. వారి ఉజ్వల భవిష్యత్తుకు చక్కటి మార్గాన్ని వేసేందుకు అన్నివిధాలా కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, వైస్ చైర్మన్ పీ.వెంకటేశ్వరరెడ్డి, ఏవో కళ్ళం నవ్య, ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు, వివిధ విభాగాల హెచ్‌వోడిలు పాల్గొన్నారు.

49,224 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 47,647 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 49,224 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 19,421 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	17000	334	8500	16000
నెంబరు. 5	9000	15000	నెంబరు. 5	10000	12500
273	9500	9500	273	–	–
341	8500	16500	341	9000	15000
4884	10500	15000	4884	9000	12000
సూపర్ 10	16200	16200	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18500	తేజ	9000	18500
బ్యాడిగి	8000	17000	బ్యాడిగి	9000	13000
దేవనూరు డీలక్స్	11000	13500	దేవనూరు డీలక్స్	9000	14000
తెల్లకాయలు	4500	11500	తెల్లకాయలు	5000	10500

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



కొత్తపల్లిలో సీసీ రోడ్డుకు శంకు స్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

అచ్చంపేట, ఆగస్టు7: మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ముందుగా మాదిపాడు గ్రామంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను స్థానిక నేతలు కొలగాని సత్యనారాయణ, పలువురు ఘనంగా సత్కరించారు. అనంతరం తల్లి పాల వారోత్స వాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అలాగే కొత్తపల్లిలో రూ.30 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకు స్థాపన చేశారు. ఈ కార్యక్రమమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, కంచేటి సాయి, వెనిగండ్ల కోటయ్య, ఎస్కే కాసుల, పోట్ల శ్రీనివాసరావు, పొన్నెకంటి శ్రీనివాసరావు, బత్తుల శ్రీనివాసరావు, మొక్కపాటి గిరిబాబు, రాయిడి సాంబశివుడు, బాలూ నాయక్, యడ్లపల్లి బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజాసేవకులుగా మెలగాలి

అచ్చంపేట, ఆగస్టు 7 : అధికారులు ప్రజా సేవకులుగా మెలగాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. బుధవారం అచ్చంపేటలోని పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్‌లో క్రోసూరు, బెల్లంకొండ, అచ్చంపేట మండలాల రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశమై పలు అంశాలపై దిశ నిర్దేశం చేశారు. రైతులు, సన్న, చిన్నకారు కూలీలు అధికంగా ఉన్నారని, వారి పనులను వెంటనే పూర్తిచేసేలా చూడాలన్నారు. ప్రజలను, రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని సూచించారు. చెరువు పోరంబోకు భూములను ఎవరైనా ఆక్రమిస్తే ఉపేక్షించ వద్దన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట, బెల్లంకొండ, క్రోసూరు మండలాల తహసీల్దార్లు, వీఆర్‌వోలు, సర్వేఅధికారులు పాల్గొన్నారు.

12 నుంచి శిక్షణా సమావేశాలు

నకరికల్లు, ఆగస్టు 7 : స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో ఈనెల 12, 13, 14 తేదీల్లో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణా సమావేశాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో డీ.జయమణి తెలిపారు. 12నగ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు, పారిశుధ్యం ఘన వ్యర్థాల నిర్వాహణ, చెత్త సేకరణ, పొడి చెత్త వేరుచేయుట, వర్మికంపోస్టు తయారీ, మార్కెటింగ్ చేయుట, డ్వాక్రా సభ్యులు, ప్రజల భాగస్వామ్యం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, రెండవ రోజు క్లాప్ మిత్రల అవగాహన, మూడవ రోజు వీధి దీపాల ఏర్పాటు, నిర్వాహణ శిక్షణా అంశాలపై పరీక్ష నిర్వాహణ ఎంపీడీవో జయమణి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఈ శిక్షణకు హాజరు కావాలని కోరారు.

యూటీఎఫ్ కార్యాలయానికి స్థలం కేటాయింపు

పిడుగురాళ్ల, ఆగస్టు 7: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) పిడుగురాళ్ల ప్రాంతీయ కార్యాలయానికి స్థలం కేటాయించవలసిందిగా యూటీఎఫ్ ప్రతినిధులు బుధవారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును కలిసి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే 10 సెంట్లు స్థలాన్ని కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో యూటీఎఫ్ ప్రతినిధులు విజయసారథి, ఖాశింపీరా, జమాల్, సాంబశివరావు, ఫిరోజ్, శ్రీనివాసరావు, సాయిబాబా, ఓర్సు ప్రసాద్‌లు ఎమ్మెల్యే యరపతినేనికి కృతజ్ఞతలు తెలియజేశారు.

కాపునాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

దుర్గి, ఆగస్టు 7: కాపునాడు మాచర్ల నియోజకవర్గ అధ్యక్షునిగా కస్తూరి శ్రీనివాసరావు నియమితులయ్యారు. కాపునాడు నేషనల్ అధ్యక్షుడు గళ్లా సుబ్రహ్మణ్యం నియామకపత్రం అందించారు. కాపునాడు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో వెలిదండి శ్రీనివాసరావు, బండ్ల అప్పారావు, నూరె వెంకటేశ్వర్లు, ఆకుల చెన్నయ్య తదితరులు ఉన్నారు.

క్వారీగుంతలో పడి యువకుడి మృతి

పిడుగురాళ్ల, ఆగస్టు 7: క్వారీ గుంతలో పడి యువకుడు మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీనివాసకాలనీకి చెందిన నాయిని హనుమయ్య (30) మంగళవారం రాత్రి రజక కాలనీ సమీపంలో బైపాస్ రోడ్డు పక్కనే వున్న దాబా హోటల్‌కు వెళ్లి మద్యం తాగాడు. రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఆవైపుకి పోలీసులు పెట్రోలింగ్‌కి రావడంతో దాబా హోటల్‌లో పనిచేసే కొంత మంది వర్కర్లు, నాయిని హనుమయ్య చీకట్లో సమీప పొలాల్లోకి పరుగులు తీశారు. ఈ క్రమంలో దగ్గరలో వున్న క్వారీ గుంతలో హనుమయ్య పడిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. గుంతలో నీళ్లు ఎక్కువగా వుండటంతో బుధవారం సాయంత్రం పోలీసులు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని రప్పించారు. అప్పటికే చీకటి పడుతుండటంతో గురువారం గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు పట్టణ సీఐ ఎస్ వెంకటరావు, తహసీల్దార్ జే.మధుబాబు, ఆర్ఐ శ్రీనుబాబులు తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

● ఆరోగ్య సిబ్బందితో ఎస్‌వో నీలకంఠేశ్వరరావు

మాచవరం, ఆగష్టు 7: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎస్‌వో నీలకంఠేశ్వరరావు ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని చెన్నాయపాలెం విలేజ్ హెల్త్‌క్లినిక్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం సందర్శించింది. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని గ్రామాల ఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నీలకంఠేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాలలో పంచాయతీ సిబ్బందితో సమన్వయంచేసుకుంటూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు ఇంటింటి సర్వే నిర్వహించాలని సూచించారు. పారిశుధ్య చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిపిఓ వున్నూరు భాష, స్థానిక మెడికల్ ఆఫీసర్ ప్రసాదరావు, అన్వేష్, నజీరిన్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తనిఖీలు

పిడుగురాళ్ల, ఆగస్టు 7: తూనికల కొలతల శాఖ అధికారులు బుధవారం పిడుగురాళ్లలోని పలు సెల్‌ఫోన్ దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. అధిక ధరలకు, బరువునకు సంబంధించి తూకాలను గుర్తించారు. ధరలకు, వస్తువులకు వున్న వ్యత్యాసాన్ని గుర్తించడం జరిగిందని తూనికల కొలతల శాఖ డీఎస్పీ ఎన్ అల్లూరయ్య, సీఐ జాన్‌సైదాలు తెలిపారు.



పొంగిపొర్లుతున్న గోలి వాగు

పొంగి పొర్లుతున్న వాగులు

రెంటచింతల,ఆగస్టు 7: మండలంలోని గోలి గ్రామ సమీపంలోగల గోలి వాగు పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. వాగు చప్టా మీద నుంచి నీళ్లు ప్రవహిస్తుండడంతో సత్రశాలలోని జెన్‌కో, సిమెంట్ ఫ్యాక్టరీ, తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రజలు తీవ్ర ఇక్కట్లకు లోనయ్యారు. 6 కిలోమీటర్ల దూరంలోని పాలువాయి జంక్షన్‌కు వెళ్లి అక్కడ నుంచి గమ్యస్థానాలకు బయలుదేరారు. వాగులో గుర్రపు డెక్క, తూటికాడ కొట్టుకురావడంతో వంతెనకు అడ్డుపడి నీరు నిలిచిపోయింది. వాగుకు సమీపంలోని నాపరాయి క్వారీలన్నీ నీట మునిగాయి. బుధవారం ఉదయం వరకు 3 సెం.మీ వర్షం కురిసినట్లు వర్షపాత నమోదు అధికారి ఈశ్వర్‌రెడ్డి తెలిపారు.

వెల్దుర్తి: మండల పరిధిలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వాగులు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. పట్లవీడు, ఉప్పల పాడుబొత్తలవాగు, ఎర్రవాగు పొంగి పొర్లుతున్నాయి. మండల పరిధిలో 66.2 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

యథేచ్ఛగా దొంగతనాలు

● కేసుల నమోదుతో సరిపుచ్చుతున్న పోలీసులు
● నిందితుల పట్టివేత, రికవరీ శూన్యం
● హడలిపోతున్న మాచర్ల పట్టణ ప్రజలు
● నీరు గారిన నిఘా వ్యవస్థ ● మూడు నెలల్లో 8 చోరీలు

ఇటీవల పట్టణంలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. దొంగల తెగువో.. పోలీసుల అలసత్వమో ఏమో దొంగతనం కేసులు పెరుగుతుంటే, పోలీసులు మాత్రం చోరీ జరిగిన గృహాలను పరిశీలించి కేసునమోదు చేయడంతోనే సరిపుచ్చుతున్నారు. నిందితులను పట్టుకోవడం, సొత్తు రికవరీ చేయడం వంటివి జరగడం లేదు. ఎప్పటికప్పుడు చురుగ్గా వ్యవహరించాల్సిన నిఘా వ్యవస్థ సైతం నీరు కారిపోయినట్లనిపిస్తోంది.

మాచర్లటౌన్, ఆగస్టు 7: గత మూడు నెలల్లో పట్టణంలో ఏడు దొంగతనాలు దాకా జరిగాయి. వీటిలో ప్రధానంగా రింగురోడ్డు సెంటర్లో రెండు నెలల క్రితం బిల్డర్ ఉప్పుతోళ్ల శ్రీనివాసరావు ఇంట్లో దొంగలు చొరబడి రూ. 90 వేల నగదు, బంగారు గొలుసు, రెండు సెల్‌ఫోన్లు అపహరించారు. పీడబ్ల్యూడీ కాలనీలో నరసింహారావు అనే వ్యాపారి గృహంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పాత మాచర్లలోని ఆంజనేయస్వామి ఆలయంలో దొంగలు జొరబడి హుండీ పగులకొట్టి కానుకలను దొంగిలించారు.

తాజాగా మరో రెండు గృహాల్లో...

మంగళవారం అర్ధరాత్రి 14వ వార్డులో రెండు గృహాల్లో చోరీ జరిగింది. ఎరువుల వ్యాపారి భవనాసి గోవిందు గృహంలో దొంగలు చొరబడి నాలుగున్నర కేజీల వెండి వస్తువులు అపహరించారు. గోవిందు కుటుంబసభ్యులతో కాశీ వెళ్లి బుధవారం ఉదయమే తిరిగి వచ్చారు. గృహం లోపలికి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. అలాగే గోవింద్ ఎదురుగా ఉన్న బండారు అంజమ్మ అనారోగ్య కారణాలతో మంగళవారం ఆసుపత్రికి వెళ్లారు. తిరిగి వచ్చి చూసేసరికి



సాయిబాబా ఆలయంలో వద్ద చైన్ స్నాచింగ్ బాధితురాలు సత్యవతి (ఫైల్)



గోవిందు, అంజమ్మ గృహాల్లో దొంగలు పగులకొట్టిన బీరువాలు

గృహంలో బీరువా పగులకొట్టి ఉంది. అయితే చీరల్లో నగదు దాచుకోవడంతో అవి దొంగల కంట్లో పడకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

చైన్ స్నాచింగ్‌తో హడల్...

ఇవేకాక నెల రోజుల వ్యవధిలో 14వ వార్డులో రెండు చైన్ స్నాచింగ్‌లు జరిగాయి. జూలై 21వ తేదీన పాలువాయి సత్యావతి వార్డులోని సాయిబాబా గుడికి వెళ్తుండగా ఆమె వెనుకగా బైకుపై వచ్చిన దొంగలు గొలుసులు లాక్కొని పరారవుతున్నారు. ఇదే వార్డులో ఇదే విధంగా మరో మరో మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లారు. అలాగే జూన్ 2వ తేదీన 17వ వార్డులో జల్లె లక్ష్మీ మల్లేశ్వరి అనే మహిళ రామాలయంకు వెళ్లి నడుచుకుంటూ ఇంటికి తిరిగి వెళ్తుండగా వెనుకగా బైకుపై వచ్చిన వ్యక్తులు మెడలో బంగారు గొలుసు లాక్కొని వెళ్లిపోయారు. ఆయా దొంగతనాల సమయంలో మహిళల మెడ భాగంలో గాయాలు కూడా అయ్యాయి.

నిద్రావస్థలో నిఘా వ్యవస్థ...

వరుస దొంగతనాలతో ప్రజలు హడలిపోతున్నారు. పోలీసులు దొంగతనాలు జరిగిన ప్రదేశానికి వెళ్లి ఫిర్యాదు నమోదు చేసుకుంటున్నారే గానీ నిందితులను పట్టుకోవడం, దొంగతనానికి గురైన సొత్తు రికవరీ చేయడం వంటివి చేయటం లేదు. రాత్రి వేళ గస్తీ నిర్వహించాల్సిన పోలీసులు ఏంచేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో యువత విచ్చలవిడిగా గంజాయి, మద్యం తాగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం

నకరికల్లు, ఆగస్టు 7 : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. బుధవారం నకరికల్లు మండలం కుంకలగుంటలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు, తల్లిపాల ప్రాముఖ్యం గూర్చి వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు బిడ్డకు వ్యాధికి నిరోధకశక్తిని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు అనురాధ, రత్నకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా, మహిళా పోలీసులు చట్టు నాగజ్యోతి, మాధురిలు పాల్గొన్నారు.

దాచేపల్లి: తల్లిపాలు శ్రేష్టమైనవని, తల్లులు బలవర్ధకమైన ఆహారం తీసుకోవడంతో సంతానం బలవర్ధకంగా వృద్ధి చెందుతుందని పలువురు తెలిపారు. బుధవారం తల్లిపాల వారోత్సవాల చివరి రోజు గర్భిణులకు ప్రభుత్వం అందజేసిన పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో చింతపల్లి హసన్ అహ్మద్, కూరాకుల నాగేశ్వరరావు, బొజ్జా అంజి, తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు : తల్లి పాల ద్వారానే పుట్టిన పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మొహిబున్నీసా అన్నారు. బుధవారం మండలంలోని 88 తాళ్ళూరులో తల్లిపాల వారోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు తల్లి పాలనే పట్టించాలన్నారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంగమ్మ, మల్లేశ్వరి, ప్రభావతి, తిరుపతమ్మ, హెల్పర్లు పాల్గొన్నారు.

డీవైఈవోపై చర్యలు తీసుకోవాలి

● డీఈవోకు టీడీపీ నేత వినతి

మాచర్ల రూరల్, ఆగస్టు 7: డీవైఈవో వేణుగోపాల్‌పై చర్యలు తీసుకోవాలని డీఈవో వెంకటేశ్వర్లును టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాతులూరి కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం నరసరావుపేటలోని విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందించారు. ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు కావాలంటే డీవైఈవో వేణుగోపాల్ లంచం అడుగుతున్నారని ఆ వినతి ప్రతంలో ఆర్కోంటూ ఆయనపై చర్యలు తీసుకోవాలని డీఈవోను సాతులూరి కుమార్ కోరారు.

దూరవిద్యా ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానం

గురజాలటౌన్, ఆగస్టు 7: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యాన 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులలో అడ్మిషన్ జరుగుతున్నట్లు స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాల హెచ్ఎం ఆశాలత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 27వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్: 9398710992 సంప్రదించాలని కోరారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురు అరెస్ట్

గురజాలటౌన్, ఆగస్టు 7: మండలంలోని జంగమహేశ్వరపురంలో ఆదివారం ఇరువర్గాల మధ్య ఘర్షణ ఘటనలో పోలీసులు ఇరువర్గాలపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ఒక కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో పరిచినట్లు ఎస్ఐ సౌందర్‌రాజన్ తెలిపారు. కేసుల్లో ఉన్న మరికొంత మంది నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని సీఐ బాలకృష్ణ తెలిపారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

సత్తెనపల్లి, ఆగస్టు 7 : ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన వారోత్స వాల్లో భాగంగా బుధవారం తెలుగుదేశం, జనసేన యువత ఆధ్వర్యంలో 17వ వార్డులోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎలినేడి రామస్వామి, నాయకులు సయ్యద్ పెద కరిముల్లా, సయ్యద్ గౌస్, శిరిగిరి మణికంఠ, ఆరేపల్లి కొండలు, నూరుల్లా, యక్కల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విత్తన నమూనాల సేకరణ

నకరికల్లు, ఆగస్టు 7: నాణ్యత ప్రమాణాల నిమిత్తం రెండు విత్తన నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపినట్టు ఏవో కే దేవదాసు తెలిపారు. బుధవారం నకరికల్లులోని ఎస్.చిన్నయ్య అండ్ సన్స్ విత్తన దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. బిల్లు బుక్స్‌ను, స్టాక్ రిజిస్టర్లను, సోర్స్ ఆఫ్ సప్లయ్ సర్టిఫికెట్‌లను ఆయన పరిశీలించి, విత్తనాల నిల్వలను తనిఖీచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయశాఖ నుంచి విత్తన లైసెన్స్‌లు పొందిన డీలర్ల వద్దమాత్రమే పరివిత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. విక్రయ రసీదు పై తప్పనిసరిగా కొనుగోలు దారుని సంతకం, అమ్మకం దారుని సంతకం, విత్తనం రకం, లాట్ నెంబరు ఉండేలా చూసుకోవాలన్నారు. రైతులు ఎంటీయూ 1224, ఎంటీయూ 1282, కేఎన్ఎం 1638, కేఎన్ఎం 733, ఆర్ఎన్ఆర్ 1548, ఏపీ 567, జేజీఎల్ 384 రకం విత్తనాలను సాగు చేసుకోవాలని సూచించారు.

ప్రతి ఇంటికి సురక్షిత నీరు

కారంపూడి, ఆగస్టు 7: జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కులాయి ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించనున్నట్లు జల జీవన్ మిషన్ జిల్లా కో-ఆర్డినేటర్ తేజు సంగీత్ తెలిపారు. మండలంలోని లక్ష్మీపురంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు సురక్షిత నీటిని అందిస్తామన్నారు. గ్రామ మంచినీటి, పారిశుధ్య కమిటి పర్యవేక్షణలో నీటిని అందించనున్నట్లు చెప్పారు. ఇందుకు అవసరమైన కార్యచరణ ప్రణాళిక బాధ్యత కమిటి తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో సత్యప్రసాద్, స్వచ్ఛభారత్ మండల కో-ఆర్డినేటర్ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

55 పాఠశాలల్లో ఎస్‌ఎంసీలు ఎన్నికలు

అమరావతి, ఆగస్టు 7: మండల పరిధిలోని 55 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శివబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో సమస్యలుంటే సమాచారం అందించాలని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నకరికల్లు, ఆగస్టు 7 : కుటుంబ ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఈ నెల 2న ఎలుకల పేస్టు తిని ఆస్పత్రిపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు ఒక ప్రకటనల పేర్కొన్నారు. బాలాజీ నగర్ తండాకు చెందిన రామావత్ దేవానాయక్ కుటుంబంలో ఆర్థిక సమస్యలు, తన కుమారుడికి ఆరోగ్య సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురై ఈనెల 2వ తేదీ ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఎలుకల పేస్ట్ తిన్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్సకోసం గుంటూరు జీజీహెచ్‌కి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ దేవానాయక్ మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు నకరికల్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

బెల్లంకొండ, ఆగస్టు 7: మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం విద్యుతాఘాతానికి గురై ఎద్దు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎద్దు యజమాని సంగు రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పొలంలో అరక దున్ని అనంతరం తాను భోజనం చేసేందుకు వెళుతూ ఎద్దును మేతకు వదిలినట్లు తెలిపాడు. ఎద్దు మేత మేసే క్రమంలో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ 11కేవీ బుషింగ్ రాడ్డుకు ఆనుకోవటంతో విద్యుత్ షాక్‌కు గురై ఎద్దు అక్కడికక్కడే మృతి చెందినట్టు రైతు తెలిపాడు. మృతి చెందిన ఎద్దు ఖరీదు సుమారు రూ.90 వేలు వరకు ఉంటుందని రైతు తెలిపాడు. ప్రభుత్వం దయ ఉంచి తనకు నష్ట పరిహారం అందించాలని రైతు రామాంజనేయులు కోరాడు.

ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చూడండి

● ముంపు ప్రభావిత ప్రాంత అధికారులను ఆదేశించిన ఆర్డీవో
● మండలం లోని కృష్ణా పరివాహక గ్రామాల సందర్శన



రేగులగడ్డ గ్రామంలో కృష్ణానది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

మాచవరం, ఆగస్టు 7: నాగార్జునసాగర్ నుంచి విడుదలవుతున్న నీటి ప్రవాహంతో కృష్ణా పరివాహక గ్రామాల ప్రజలను అప్రమత్తంగా వుంచేలా చూడాలని స్థానిక అధికారులను గురజాల ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం మాచవరం మండలంలోని కృష్ణా పరివాహక గ్రామాలైన రేగులగడ్డ, వేమవరం, వెల్లంపల్లి గ్రామాలను సందర్శించి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయా గ్రామాలలో నీటి ప్రవాహం వల్ల కలిగే ఇబ్బందుల గురించి స్థానిక అధికారులు ప్రజలతో చర్చించారు. పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం వల్ల రేగులగడ్డ, వెల్లంపల్లి గ్రామాలను పూర్తిగా, వేమవరం గ్రామాన్ని పాక్షికంగా ముంపు జాబితాలోకి తీసుకున్నారు. ఆయా గ్రామాలను సందర్శించి నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ఆర్డీవో ప్రజలను అప్రమత్తంగా వుంచేలా చూడాలని వీఆర్వోలు, వీఆర్ఏలను ఆదేశించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నీటి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలియజేశారు.

చెన్నాయపాలెం సచివాలయం రికార్డుల పరిశీలన..

అనంతరం చెన్నాయపాలెం గ్రామానికి చేరుకొని సచివాలయాన్ని సందర్శించి వివిధ రికార్డులను పరిశీలించారు. ఎంతమంది అధికారులు ఉన్నారు, విధులకు సక్రమంగా వస్తున్నారా, లేదా అని పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. మూమెంట్ రిజిస్టర్‌ను, అటెండెన్స్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆయనవెంట ఎంపీడీవో సురేష్, ఈవోఆర్‌డీ వెంగళరావు, ఆర్ఐ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పీ.శ్రీనివాసరావు, సురేఖ, నాగమల్లేశ్వరరావు, వీఆర్వోలు, వీఆర్ఏలు, టీడీపీ నాయకులు ఉన్నారు.



కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, జేపీ నడ్డాను కలసిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

● కేంద్ర మంత్రులను కోరిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఆగస్టు 7 : సత్తెనపల్లి నియోజక వర్గ అభివృద్ధిలో కీలక మైన ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ఢిల్లీలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలతో కలసి పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. కొండమోడు - పేరేచర్ల జాతీయ రహదారి విస్తరణ అభివృద్ధికి నిధులు మంజూరుతో పాటు సత్తెనపల్లి పట్టణంలోని అచ్చంపేట రోడ్డులోని రైల్వే గేటు వద్ద ఆర్‌వోబీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి జేపీ నడ్డాలను కోరారు. మేడికొండూరు మండలం పేరేచర్ల నుంచి రాజుపాలెం మండలం కొండమోడు వరకు పెరగనున్న జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సత్తెనపల్లి పట్టణ పరిధిలోని అమరావతి మేజరు కాలువ పై నూతన బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించాలని కూడా కన్నా కోరారు. ఈ సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన నాయుడును కూడా కన్నా లక్ష్మీనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు.



మాదల గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం

● మాదాల గ్రామస్థులతో ఎస్పీ శ్రీనివాసరావు

ముప్పాళ్ళ, ఆగస్టు 7 : రాజకీయాలు ఎన్నికలకే పరిమితం కావాలని, తరువాత ప్రజలు ప్రశాంతంగా ఉండాలని ఎస్పీ కే.శ్రీనివాసరావు అన్నారు. ముప్పాళ్ళ పోలీసు స్టేషన్‌ను ఎస్పీ శ్రీనివాసరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాదల గ్రామం వెళ్ళి గ్రామస్థులతో మాట్లాడారు. గొడవలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు జీవించాలని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని చూసించారు. ఆయన వెంట సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబు, సీఐ రాంబాబులు ఉన్నారు.

చేనేత సమస్యల పరిష్కారానికి కృషి

పెదకూరపాడు, ఆగస్టు 7 : చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళరమేష్ అన్నారు. మండలంలోని లగడపాడులో బుధవారం జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నేతన్నలకు ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం జిల్లా అధ్యక్షులు చిల్లపల్లి సత్యం, పద్మశాలీయ సంఘనేతలు అవ్వారు రవీంద్రనాథ్ ఠాగూర్, పాముల హనుమంతరావులు జింకా రామారావు, గోలి వంశీ, వట్టికూటి శివ రామ కృష్ణయ్య, మోదుగుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల అపరిశుభ్రతతోనే వ్యాధుల వ్యాప్తి

● జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్

క్రోసూరు, ఆగస్టు 7: పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం ద్వారానే సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ తెలిపారు. బుధవారం మండలంలోని పారుపల్లిలో కొనసాగుతున్న వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో నీరు నిల్వ ఉండ కుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తికి దోమలే కారణమని, దోమల వృద్ధి, వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. గ్రామంలోని ఇంటింటికి ఆయన తిరిగి నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గమనించి వాటిని తీసివేయించారు. మురుగు కాలువల్లో ఎబాట్ ద్రావణాన్ని, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. ఆయన వెంట హెల్త్ సూపర్ వైజర్ శివుడు, ఆరోగ్య అధికారి జ్యోతిర్మయి, ఏఎన్ఎంలు, ఆషా వర్కర్లు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

పెదకూరపాడు, ఆగస్టు 7 : మండలంలోని లగడపాడులో స్థానిక సంగం డెయిరీ మిల్క్ కలెక్షన్ సెంటర్‌లో 34 మంది రైతులకు రూ.1,06,275 నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంగం డెయిరీ అధ్యక్షుడు బత్తుల కోటేశ్వరరావు మాట్లాడుతూ పాడి రైతుల కుటుంబాల శ్రేయస్సుకు ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి మెమోరియల్ హాస్పటల్ ద్వారా రాయితీపై వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. సంగం డెయిరీ మేనేజర్ గోపీ మాట్లాడుతూ సంగం డెయిరీ ద్వారా పశుబీమాతో పాటు పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, సబ్సిడీపై పశుగ్రాసం, విత్తనాలు, దాణా అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో తాగునీటి చేతి పంపు ఏర్పాటు

ముప్పాళ్ళ, ఆగస్టు 7: మండలం లోని మాదల ఎస్సీ కాలనీలోని ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో వియాత్నం బౌద్ధ బిక్షువులు సొం తంగా నిర్మించిన చేతి పంపును బుధవారం ప్రారంభించారు. ఆచా ర్య నాగార్జున విశ్వ విద్యాలయంలో బుద్ధిస్ట్ విద్యను అభ్యసిస్తున్న వారు సత్తెనపల్లి మండలంలోని గుడిపూడి ఎస్సీ కాలనీలో, సత్తెన పల్లి పట్టణంలోని వెంకటపతి కాలనీలో, గూండ్లూరు బీసీ కాలనీల్లో సొంతంగా చేతి పంపులను నిర్మించి బుధవారం ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు కే.శ్రీనివాస రావు, రాఘ వేంద్రరరావు, ఉపాధ్యాయు లు డాక్టర్ కాసరబాద నాగేశ్వరరావు, సాంబశివరావు, సురేష్, సత్తెనపల్లి పట్టణ ఎస్ఐ కరిముల్లా, ముప్పాళ్ళ ఎస్ఐ హజరత్తయ్యలు పాల్గొన్నారు.

సమస్యలతో సహజీవనం

దుర్గి, ఆగస్టు 7: మండల కేంద్రమైన దుర్గిలోని ఇందిరమ్మ కాలనీ వాసులు సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. కాలనీ ఏర్పడి 20 ఏళ్లు గడిచినప్పటికీ మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. సరైన రోడ్లు, సైడు కాలువలు లేకపోవడంతో తేలికపాటి వర్షాలకే కాలనీలోని ప్రధాన రహదారులు బురదమయమవుతున్నాయి. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాలకే కాలనీలోని రహదారులు బురదమయమై ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి సీసీరోడ్లతోపాటు సైడు కాలువలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

చంద్రశేఖరరెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం

● ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ నేతలు

సత్తెనపల్లి, ఆగస్టు 7 : ఉద్యోగుల సమస్యలపై ఎన్‌జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదమని ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ సత్తెనపల్లి శాఖ అధ్యక్షుడు పెండెం మణిరావు, కార్యదర్శి అంబేద్కర్‌లు అన్నారు. బుధవారం సాయంత్రం ఎన్‌జీవో హోంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మూడు సంవత్సరాల పదవీ కాలంలో చంద్రశేఖరరెడ్డి ఒక్క డీఏ కూడా ఇప్పించ లేక పోయారన్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడవక ముందే ఐఆర్ గురించి మాట్లాడటం హాస్యాస్పదం అన్నారు. ఉద్యోగులు రివర్స్ పీఆర్‌సీ తీసుకొని తీవ్రంగా నష్ట పోయారన్నారు. సమావేశంలో కోటేశ్వరరావు, రవిచంద్ర కుమార్, సింధు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

చేనేత వస్త్రాలను ఆదరించాలి

ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట టౌన్, ఆగస్టు 7: ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ఆదరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. బుధవారం నరసరావుపేట కలెక్టరేట్ కార్యాలయంలో 10వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా కలెక్టర్ కార్యాలయంలో ప్రదర్శనలో ఉంచిన చేనేత కార్మికులు నేసిన బట్టలను పరిశీలించారు. చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులకు చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేనేత వర్గాలకు, మగ్గం కార్మికులకు ఉచిత విద్య, వైద్యం అందించబోతున్నట్లు చెప్పడం కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందని తెలియజేశారు చేనేతరంగాన్ని నారా లోకేశ్ ప్రత్యేకంగా అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారన్నారు. కార్యక్రమకంలో డీఆర్వో కే వినాయకం, రాష్ట్ర బులిమస్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, చేనేత కార్మికులు, మగ్గం కార్మికులు పాల్గొన్నారు.



వైద్యశాలలో కాన్పుకోసం వచ్చిన మహిళను పరామర్శిస్తున్న ఐద్వా, సీపీఎం నాయకులు

ప్రభుత్వ వైద్యుల పనితీరు మారాలి

సీపీఎం, ఐద్వా నాయకులు

వినుకొండ టౌన్, ఆగస్టు 7: ప్రభుత్వ వైద్యుల పనితీరు మారాలని ఐద్వా. సీపీఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని వెన్న పూసకాలనీకి చెందిన తిరుమల గోవిందమ్మ కాన్పు కోసమని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు బుధవారం రాగా వైద్యశాలలో వైద్యులు లేరని, నరసరావుపేటకు తీసుకు వెళ్లాలని గోవిందమ్మ కుటుంబ సభ్యులకు వైద్య సిబ్బంది సూచించారన్నారు. పురిటి నొప్పులతో ఐదు గంటలపాటు బాధపడుతున్న గోవిందమ్మపై వైద్యులు కనీసం కనికరం చూపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా తప్పుడు సలహాలతో కాలంగడిపారని దీనిపై బాధిత బంధువులు తమ దృష్టికి తీసుకురావడంతో, తాము ఆందోళన చేయటంతో గోవిందమ్మకు కాన్పుచేయగా అమ్మాయి జన్మించిందన్నారు. చికిత్స అందించకుండా తాత్సారం చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బాలింతను పరామర్శించారు. కార్యక్రమంలో బొంకూరి వెంకటేశ్వర్లు, ఐద్వా జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్‌బీ, హనుమంతారెడ్డి, టి.లక్ష్మి, వెంకటప్పయ్య వెంకటకోటమ్మ తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేట మండలం పెదరెడ్డిపాలెం చప్టాపై ప్రవహిస్తున్న వర్షపునీరు

వంతెన పైనుంచి నీరు.. రాకపోకలకు అంతరాయం

పెదరెడ్డిపాలెం (నరసరావుపేట రూరల్), ఆగస్టు 7: గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నరసరావుపేట మండలంలోని వాగులు పూర్తిస్థాయిలో ప్రవహిస్తున్నాయి. మండలంలోని పెదరెడ్డిపాలెం గ్రామం వద్ద ఉన్న వాగుపై నిర్మించిన చప్టాపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు తీవ్రఅంతరాయం ఏర్పడింది. కొండకావూరు నుంచి పమిడిమర్రు గ్రామాల మధ్య ఉన్న ఓగేరువాగు, ఇక్కుర్రు మునమాక గ్రామాల మధ్యగల వాగులు పూర్తి స్థాయి నీటితో ప్రవహిస్తున్నాయి.

ఆరోగ్య పరిరక్షణతోనే వ్యాధుల నివారణ: ఎమ్మెల్యే

నరసరావుపేట టౌన్, ఆగస్టు 7: సమర్థవంతమైన ఆరోగ్య పరిరక్షణతోనే వ్యాధుల నివారణ సాకారం అవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. బుధవారం నరసరావుపేట పట్టణంలోని 13, 16, 23, 32 వార్డులలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. మున్సిపల్ కార్మికులతో కలిసి కాలువల్లో చెత్తను తొలగించారు. పిచ్చి మొక్కలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ప్రజాప్రతినిధి అంటే ఎలా ఉండాలో, ప్రభుత్వం అంటే ఎలా ఉంటుందో ప్రజలకు చూపించబోతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, కపిలవాయి విజయకుమార్, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో శిక్ష ఖరారు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 7: దాడి కేసులో నేరం రుజువు అవ్వడంతో దిగువ కోర్టు విధించిన ఒక ఏడాది జైలు శిక్షను యధాతథంగా ఖరారు చేస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయ అధికారి ఎస్.సత్యశ్రీ బుధవారం తీర్పు ఇచ్చారు. చిలకలూరిపేట మండలం పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన నిందితురాలు కొండా సత్యవతి వెయ్యి రూపాయల అప్పు చెల్లించలేదని తోట అనంత లక్ష్మిపై డోర్ కర్టెన్లకు వాడే వైరుతో విచక్షణరహితంగా దాడి చేసినట్లు 2018 మే 12 పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువడంతో ఏడాది జైలు శిక్ష విధిస్తూ 2021 ఫిబ్రవరి 12న దిగువ కోర్టు తీర్పు వెలువరించింది. నిందితురాలు ఆ తీర్పును జిల్లా కోర్టులో సవాల్ చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం దిగువ కోర్టు తీర్పును యధాతథంగా ఖరారుచేస్తూ తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి నిర్వహించారు

అదనపు జిల్లా కోర్టు ఏజీపీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట లీగల్, ఆగస్టు 7: స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఏజీపీ పదవికి దరఖాస్తులను ఆహ్వానిస్తూ గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి నోటీసు జారీచేశారు ఈ మేరకు స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఎం.సత్యశ్రీ సమాచారాన్ని నరసరావుపేట న్యాయవాద సంఘ కార్యాలయానికి పంపారు. దీని ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ మహిళ న్యాయవాదులు అర్హులైన వారు సంబంధిత ధ్రువపత్రాలతో ఈ నెల 19వ తేదీ లోపల దరఖాస్తు ఫారాలను సమర్పించాలని కోరారు

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ పదవికి దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట లీగల్, ఆగస్టు 7: మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ పదవికి దరఖాస్తులను ఆహ్వానిస్తూ బుధవారం నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ సి.రవి చంద్రరెడ్డి స్థానిక న్యాయవాద సంఘ కార్యాలయానికి సమాచారం పంపినట్లు న్యాయవాద సంఘ కార్యదర్శి అబ్బూరి ఏడుకొండలు తెలిపారు. స్థానిక న్యాయవాద సంఘంలో సభ్యుడిగా ఉండాలని, ఏడు సంవత్సరాల పైబడి ప్రాక్టీస్‌లో ఉన్న వారు దరఖాస్తు ఫారాలను సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.

సైన్స్ అధికారికి ఘన సన్మానం

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు, 7. ఉమ్మడి గుంటూరు జిల్లా, పల్నాడు జిల్లా సైన్స్ అధికారిగా పని చేసిన ఎ.ఎ. మధుకుమార్‌ను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు. స్థానిక లింగంగుంట్ల శంకరభారతీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ గత 13 సంవత్సరాలు అటు ఉమ్మడి గుంటూరు జిల్లాలోను, ఆ తర్వాత పల్నాడు జిల్లాలోను సైన్స్ అధికారిగా పని చేసి పలు సైన్స్ కార్యక్రమాలు నిర్వహించి జిల్లా విద్యాశాఖకు పేరు తెచ్చారని ప్రశంసించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులలో సైన్స్ పట్ల మక్కువ కలిగేలా ఉపాధ్యాయులను, విద్యార్థులను ప్రోత్సహించారన్నారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి కె.వేణుగోపాల్‌రావు, యేసుబాబు, ప్రస్తుత సైన్స్ అధికారి ఎస్.రాజశేఖర్, ప్రధానోపాధ్యాయులు వీరప్పయ్య, రాయపాటి సాంబశివరావు, జిల్లా అకడమిక్ కో ఆర్డినేటర్ వి.సీతారామయ్య, రిసోర్స్‌పర్సన్ బి.వి.హెచ్. రఘురామ్, బి.శ్రీనివాసరావు, ఎం.అప్పారావు, కె.శంకర్, సీహెచ్.చంద్రశేఖర్, ఎస్.హనుమంతరావు, వై.రాధ తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధునీకరిస్తాం

- జగన్ పాలనలో ఒక్క కొత్త బస్సులేదు
- కార్మికుల ప్రయోజనాలు నిల్
- మూడుసార్లు చార్జీల భారం మోపిన జగన్
- 13 నూతన బస్సుల ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవీ



ఆర్టీసీ బస్సును ప్రారంభించి, ప్రయాణికులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే జీవీ

వినుకొండ టౌన్, ఆగస్టు 7: వినుకొండ ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధునీకరిస్తామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వెల్లడించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన 13 కొత్త బస్సులను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల జగన్‌రెడ్డి పరిపాలనలో ఒక్క కొత్త బస్సు కూడా వినుకొండకు కేటాయించకపోవడం జగన్ డొక్కు పాలనకు నిదర్శనం విమర్శించారు. బొల్లా హామీలతో ప్రజలను మోసం చేశారని, రానున్న రోజుల్లో వినుకొండ ఆర్టీసీ బస్టాండ్ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. జగన్ పాలనలో ఒక్క బస్సు కూడా వినుకొండకు రాలేదని, చంద్రబాబు రెండు నెలల పరిపాలనలో 13 బస్సులు కేటాయించడం అభినందనీయం అన్నారు. ఆర్టీసీ డీఎం కోటేశ్వరరావు నాయక్ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని, గత ప్రభుత్వం హయాంలో మూడుసార్లు ప్రయాణికుల చార్జీలు పెంచి, ప్రజలపై పెనుభారాన్ని మోపారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ఆర్టీసీ కార్మికులకు చేసిందేమీ లేదని, ఉన్న హక్కులను తొలగించి, వారిని ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పట్టణ అధ్యక్షుడు ఆయూబ్ ఖాన్, పత్తి పూర్ణ, పల్ల మీసాల దానయ్య, పీవీ సురేష్, వంకాయలపాటి పేరయ్య, కాకాని వీరాంజనేయులు, చికెన్ బాబు, పుండ్ల నరసింహారావు, సీఐ శోభన్ బాబు, ఎస్ఐ కత్తి పద్మలత, ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ప్రమాద బీమా కార్డులు అందజేత

వినుకొండ, ఆగస్టు 7: శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ సహకారంతో నియోజకవర్గ జర్నలిస్టులకు ఐదు లక్షలు విలువచేసే ప్రమాద బీమా కార్డులను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అందచేశారు. నర్సరావుపేట రోడ్డులోని కేజీఎల్ ఫంక్షన్ హాల్లో బుధవారం జర్నలిస్టుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించి, వారి సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. జర్నలిస్టు కాలనీలో రోడ్లు, తాగు నీరు వంటి మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు.

జాతీయస్థాయి పురస్కార గ్రహీత బ్రహ్మంకు అభినందన

ఫొటోగ్రఫీలో జాతీయస్థాయి పురస్కారం అందుకున్న వంగపల్లి బ్రహ్మంను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు దుశ్శాలువాతో సత్కరించి, నగదు బహుమతితో అభినందించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ బ్రహ్మం అవార్డు సాధించడం వినుకొండ వాసిగా గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో కేసనపల్లి సుబ్బారావు, రాజరపు ప్రకాష్, యార్లగడ్డ ఆజాద్, ఆచారి, లగడపాటి వెంకట్రావు, నవీన్, నారాయణ, అంజి, యూసఫ్, తెప్పల శ్రీనివాసరావు, స్టీవెన్, అనీల్, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబరు పద్మావతి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషన్ మెంబరు బత్తుల పద్మావతి, పక్కన జేసీ సూరజ్ ధనుంజయ్ తదితరులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 7: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబరు బత్తుల పద్మావతి అన్నారు. బుధవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గుర్రం జాషువా సెమినార్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నియంత్రణలో పాఠశాలల, కళాశాలల యాజమాన్యాల, ప్రిన్సిపాల్స్ పాత్రపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనే అంశాలు తెలిసేలా ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్లు చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో విద్యార్థులు, యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు నిత్యం తమ కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. వీటిని పాఠశాల స్థాయినుంచే రూపుమాపేందుకు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో అన్ని జిల్లాలలో సమీక్షలు, సమావేశాలు, కళాజాతాలు, వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామని చెప్పారు. కళాశాలలు వసతి గృహాలలో ప్రహరీక్లబ్‌లు ఏర్పాటు చేసేలా చర్యలకు సిఫార్సులు చేస్తున్నామని అన్నారు. ఆర్ఐవో జీకే జుబేర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు, లక్ష్యాలు నిర్దేశించుకున్నామన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కే వేణుగోపాలరావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమారాణి, జీసీడీవో డీ రేవతి, స్త్రీ, శిశు, సంక్షేమ శాఖ సిబ్బంది, జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది, వివిధ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

సహ చట్టంపై అవగాహన పెంచుకోవాలి

● ఏడీఏ బోయపాటి రవిబాబు

శావల్యాపురం, ఆగస్టు 7: సమాచార హక్కు చట్టం 2005 గురించి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, రైతుభరోసా కేంద్రాల్లోని సిబ్బంది, రైతులు అవగాహన కలిగి ఉండాలని వినుకొండ ఏడీఏ బోయపాటి రవిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్టీయాక్ట్ గురించి ఆర్బీకే సిబ్బందికి బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ఆర్టీయాక్ట్ ద్వారా రైతులెవరైనా తమకు కావలసిన సమాచారాన్ని అడిగినపుడు ఆర్బీకే సిబ్బంది వెంటనే స్పందించి వారికి సకాలంలో సమాచారాన్ని ఇవ్వాలన్నారు. తక్షణమే అందుబాటులో లేకపోతే వారికి నిర్దేశించిన గడువులోగా సమాచారాన్ని ఇవ్వాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలు ఈ-పంటలో నమోదు చేసుకునేందుకు సెప్టెంబరు 15వరకు ప్రభుత్వం గడువును ఇచ్చిందని, వీఏఏలు మొబైల్‌యాప్‌లో ఈక్రాప్ నమోదు ప్రక్రియను వేగవంతంచేసి గడువులోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఎంఏవో రామినేని రామారావు, ఏఈవో పూరేటి అశోక, ఈ-పంట ట్రైనర్ నరేంద్రబాబు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఎమ్మెల్యే సమీక్ష

వినుకొండ టౌన్, ఆగస్టు 7: పట్టణంలో విద్యుత్ సమస్యలపై ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా పట్టణంలో పురాతన కాలం నాటి విద్యుత్ స్తంభాలు పునఃనిర్మాణం, లోవోల్టేజి సమస్యలపై అధికారులతో చర్చించారు. వెంటనే పట్టణంలోని వార్డుల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించాలని, అవసరం అయిన చోట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు ఎస్టిమేట్స్ తయారు చేయాలని జీవీ అధికారులను సూచించారు. అదేవిధంగా రైతులకు సకాలంలో విద్యుత్ కనెక్షన్లు అందించాలని, అక్రమ వసూళ్లకు పాల్పడితే క్షమించేదిలేదని హెచ్చరించారు. సమస్యల పరిష్కానికి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌సీ మురళీకృష్ణయాదవ్, ఈఈ శ్రీనివాసరావు, డీఈ కిరణ్ బాబు, నర్సరావుపేట డీఈ వెంకటేశ్వరరెడ్డి, వివిధ మండలాల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

వయ్యకంటి శివప్రసాద్‌కు ఘన నివాళి

వినుకొండ టౌన్, ఆగస్టు 7: వినుకొండ పేద ప్రజల పక్షపాతి, సమసమాజ స్థాపనకు జీవితాంతం పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి, కమ్యూనిస్టు యోధుడు వయ్యకంటి శివప్రసాద్ అని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ అన్నారు. స్థానిక శివయ్య భవన్‌లో నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు అధ్యక్షతన వయ్యకంటి శివప్రసాద్ 21వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా శివప్రసాద్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు సంద్రపాటి సైదా, పటాన్ లాల్‌ఖాన్,ఆర్ వందనం, పి.వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, అంజయ్య ధూపాటి మార్కు, కోటయ్య, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

12న మండల సర్వసభ్య సమావేశం

వినుకొండ, ఆగష్టు 7: ఈ నెల 12వ తేదీన మండల ప్రజా పరిషత్ కార్యాలయం పరిషత్ అధ్యక్షుడు చింతం జయశ్రీ అధ్యక్షతన సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నర్సయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

వరి విత్తనాలకు డిమాండ్

రొంపిచర్ల, ఆగస్టు 7: సాగర్ కాలువలకు నీరు రావటంతో వరి విత్తనాలకు డిమాండ్ బాగా పెరిగింది. కాలువలు వస్తాయని తొలిసారి రైతులు అనుకున్నప్పుడు 30కిలోల జేజేలు విత్తనాల బస్తా రూ.1600 వరకు ఉంది. వీటికి గిరాకీ బాగా పెరగటంతో ప్రస్తుతం రూ.2200 వరకు ధర పలుకుతోంది. మండలంలోని రైతులు ఇతర జిల్లాలకు, తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలకు వరి వంగడాల కోసం వెళ్తున్నారు. మార్కెట్ యార్డు, మార్క్‌ఫెడ్ ద్వారా జేజేలు, వరి వంగడాలను రైతులకు అందజేయాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

జాతీయ రహదారిపై వాహన తనిఖీలు

యడ్లపాడు, ఆగష్టు 7: పదహారో నంబరు జాతీయ రహదారిపై యడ్లపాడు ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ సమీపంలో పోలీసులు బుధవారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. సరైన ధృవపత్రాలు లేని ఐదుగురు ద్విచక్రవాహనదారులకు, యూనిఫాం ధరించకుండా, అధిక సంఖ్యలో ప్రయాణికులతో వెళుతున్న ఆటో డ్రైవర్లకు రూ.1,350లు అపరాధరుసుం విధించినట్లు ఎస్ఐ శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్ తెలిపారు.

నాదెండ్ల సహకార సంఘంలో ఇష్టారాజ్యంపై..

వైసీపీ నేతలకు హైకోర్టులో ఎదురుదెబ్బ

నాదెండ్ల, ఆగస్టు 7: గడిచిన వైసీపీ పాలనలో ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకున్న వైసీపీ నేతలకు హైకోర్టు షాక్ ఇచ్చింది. నాదెండ్ల సహకార సంఘంలో సీఈవోగా పనిచేస్తున్న చేకూరి ధనలక్ష్మిని తొలగిస్తూ త్రీమెన్ కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఎలాంటి కారణం లేకుండా ఆమెను తొలగించటం చట్ట విరుద్ధమని న్యాయస్థానం తేల్చి చెప్పింది. ధనలక్ష్మిని మళ్ళీ సీఈవోగా నియమించి ఆమెకు రావాల్సిన జీతభత్యాలను కూడా చెల్లించాలని హైకోర్టు న్యాయమూర్తి కే మన్మధరావు తీర్పు ఇచ్చారు. 1997నుంచి తాను క్లర్క్‌గా పని చేస్తూ 2016లో సీఈవోగా పదోన్నతి పొంది సంఘంలో పనిచేస్తున్నానని ధనలక్ష్మి పిటిషన్‌లో వివరించారు. ఎలాంటి ఆరోపణలు, కారణాలు చూపకుండా తనను అన్యాయంగా ఏప్రిల్ 4, 2020వ తేదీన తొలగించారని పేర్కొన్నారు. బాధితురాలు ధనలక్ష్మీ తరుపున హైకోర్టు న్యాయమూర్తి ఘంటా ప్రసాదు తన వాదనలు వినిపించారు. ఈ వాదనలపై న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కాగా ఆగస్టు 5వ తేదీన ఆంధ్రజ్యోతిలో సహకార సంఘంలో అక్రమాలపై నిగ్గు తేల్చేనా? అనే శీర్షికతో ప్రచురితమైన కథనంతో వైసీపీ నాయకులు నాయకులు నిబంధనలు ఉల్లంఘించారనే విషయం తేటతెల్లమైంది.

ఆరుగురు జూదరుల అరెస్టు

యడ్లపాడు, ఆగష్టు 7 : మండల కేంద్రమైన యడ్లపాడు బీసీ కాలనీలోని ఓ పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు దాడులు నిర్వహించిన పోలీసులు స్థానిక కోళ్ళఫారం పక్కన గల షెడ్డులో పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,970లు నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్ తెలిపారు.

లారీని ఢీకొన్న బొలేరో వాహనం

నాదెండ్ల, ఆగస్టు 7: మండలంలోని గణపవరం గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై ఆయిల్ ట్యాంకర్‌ను బొలేరో వాహనం ఢీకొట్టింది. ఆయిల్ ట్యాంకర్ గణపవరం గ్రామంలోని వేలూరు డొంకలోకి వెళ్ళేందుకు జాతీయ రహదారి దాటుతుండగా గుంటూరు నుంచి ఒంగోలు వైపు వెళ్ళే బొలేరు వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఐతే బొలేరు ముందు భాగం ధ్వంసమైంది.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు

కారుమంచి (శావల్యాపురం) ఆగస్టు 1: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 1 నుంచి చేపట్టిన తల్లిపాల వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. పోట్లూరు, వయ్యకల్లు అంగనవాడీ కేంద్రాల్లో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యంపై గర్భిణులు, బాలింతలు, మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అంగనవాడీ టీచర్లు అరుణ, విజయలక్ష్మి, సుభావతి, పుణ్యకుమారి, నాగరాజ, శ్రీలక్ష్మి, భూదేవి, మహిళా పోలీసులు మౌనిక, గురవమ్మ పాల్గొన్నారు.

● బొల్లాపల్లి, ఆగస్టు 7: మండలంలోని వెల్లటూరులో తల్లి పాల ముగింపు వారోత్సవాలకు బుధవారం అంగన్ వాడీ సూపర్ వైజర్ పద్మజారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంగన్ వాడీ సెంటర్ల ద్వారా తల్లి, బిడ్డలకు కావాల్సిన సలహాలను, సూచనలను బాలింతలకు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ సుసాన్, అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, ఆషా వర్కర్లు, సచివాలయ సిబ్బంది నగ్మా బాయి, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

రొంపిచర్ల మండలంలో ఎడ తెరిపి లేకుండా వర్షం

రొంపిచర్ల, ఆగస్టు 7: మండలంలోని గ్రామాల్లో బుధవారం రాత్రి ఎడ తెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ఉదయం మండల కేంద్రమైన రొంపిచర్లలో జనసంచారం పెద్దగా లేదు. వర్షాలు అధికంగా కురవటంతో మండలంలోని ఓగేరు వాగుకు నీరు అధికంగా వస్తోంది. దీంతో పరివాహక ప్రాంతాలైన రెడ్డిపాలెం, మర్రిచెట్టుపాలెం, మాచవరం, అన్నవరం, ముత్తనపల్లి, మునమాక గ్రామాల్లో ఓగేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది.

వడ్డెర సంక్షేమ సేవా సంఘం నూతన కమిటీ ఏర్పాటు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 7: పట్టణంలోని పెద్దచెరువులో ఉన్న ఓడ్డే ఓబన్న కమ్యూనిటీ హాల్‌లో బుధవారం వడ్డెర సంక్షేమ సంఘం నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించింది. కార్యక్రమానికి చల్లా హనుమంతురావు అధ్యక్షత వహించారు. గౌరవాధ్యక్షుడిగా దేవళ్ళ వెంకటేశ్వరరావు, అధ్యక్షుడిగా బి.శివయ్య, ఉపాధ్యక్షుడిగా ఎం.మల్లికార్జునరావు, బి.ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి టి.నరసింహారావు, జాయింట్ సెక్రటరీగా టి.నాగుల్‌మీరా, డి.శ్రీనివాసరావు, కోశాధికారిగా బి.వెంకటేష్ బాధ్యతలు స్వీకరించారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

అభివృద్ధిని పరుగులు పెట్టించాలి: ఎమ్మెల్యే జీవీ

నూజెండ్ల, ఆగస్టు 7: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంగా పనిచేసి గ్రామాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టించాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశంలో జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గత ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో ఊరికి దూరంగా వాగులు, వంకలు, శ్మశానాల్లో లే అవుట్లు వేయటంతో గృహ నిర్మాణానికి, ప్రజలకు అనుకూలమైన స్థలాలు కాకపోవటంతో ముందుకు రాలేదన్నారు. నాటి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు మాత్రమే ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినట్లుగా ప్రచారం చేసుకుందన్నారు. నేడు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ప్రోత్సాహం కంటే అదనంగా రాష్ట్ర ప్రభుత్వం తన నిధులను కలిపి పేదల గృహ నిర్మాణానికి రూ.4 లక్షలు ఇవ్వనున్నామన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మండలంలోని అగ్రహారం భూముల రైతులకు పట్టాదారు పుస్తకాలు త్వరితగతిన ఇవ్వాలని, రూరల్ అర్బన్ నిధులతో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేసేందుకు చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. గుండ్లకమ్మ నదిపై ప్రతి పది కిలో మీటర్లకు ఒక చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడం జయ రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో వీరభద్రాచారి, తహసీల్దార్ జీ రమేష్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఆర్ క్లబ్‌లో పోలీసుల తనిఖీలు

చిలకలూరిపేట, ఆగస్టు 7: పట్టణంలో సీఆర్ క్లబ్‌లో చిలకలూరిపేట అర్బన్ పోలీసులు బుధవారం తనిఖీలు జరిపారు. అర్బన్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో అర్బన్ ఎస్ఐ పుల్లారావు, ఇతర పోలీసు సిబ్బంది వచ్చి క్లబ్ తలుపులు వేసి క్లబ్ ప్రాంగణం మొత్తం తనిఖీ చేశారు. ఆ సమయంలో క్లబ్‌లో ఉన్న క్లబ్ సభ్యుల వివరాలను వారు సేకరించారు. వారి ఫొటోలను కూడా తీసుకున్నారు. క్లబ్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ఈ తనిఖీలు నిర్వహించినట్టుగా సమాచారం.

పోలేరమ్మ దేవాలయంలో చోరీ

నూజెండ్ల, ఆగస్టు 7: మండలంలోని పమిడిపాడు గ్రామ సమీపంలో ఉన్న పోలేరమ్మ దేవాలయంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హుండీ తాళం పగల గొట్టి కానుకల నగదును అపహరించారు. ఈ సంఘటన పై గ్రామస్థులు ఐనవోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి రవిబాబు

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

● జిల్లా వైద్యాధికారి రవిబాబు

నాదెండ్ల, ఆగస్టు 7: వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారి బీ రవిబాబు అన్నారు. మండలంలోని నాదెండ్ల, గణపవరం గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గణపవరంలో జరుగుతున్న ఇమ్యూనైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏ గ్రామంలోనైనా జ్వరాలు, ఇతర వ్యాధులు ప్రబలితే ఆరోగ్య సిబ్బంది బృందాలుగా వెళ్ళి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో హెల్త్ సెంటర్లలో బీసీజీ వ్యాక్సిన్ వేయాలన్నారు. మద్యం, పొగ తాగే అలవాట్లు ఉన్న వారు, 60 సంవత్సరాలు పైబడిన వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా వ్యాక్సిన్ వేయాలన్నారు. ఆయనతో పాటు వైద్యాధికారి ప్రసాదు నాయక్, సిబ్బంది ఉన్నారు.



చేనేత కళాకారులను సత్కరిస్తున్న కూటమి నాయకులు

చేనేత కళాకారులకు సత్కారం

చిలకలూరిపేట, ఆగస్టు 7: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో చేనేత కళాకారులను ఘనంగా సత్కరించారు. జనసేన నియోజక వర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్, జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, పద్మశాలి సంక్షేమ సంఘ అధ్యక్షుడు కాకుమాను రమేష్, చేనేత సాధికార సంస్థ రాష్ట్ర డైరెక్టర్ దామర్ల మనోహర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు షేక్ సుభానీ, మునీర్ హసన్, శివశంకర్, గంజి శ్రీనివాసరావు, జంజనం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశం పై అవగాహన



గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశంపై మాట్లాడుతున్న అర్బన్ ఎస్ఐ సుమన్

చిలకలూరిపేట, ఆగస్టు 7: స్థానిక ఎయింట్ చార్లెస్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో బుధవారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనే అంశంపై సోషల్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కూల్ హెచ్‌ఎం సిస్టర్ మేరీ విమల అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అర్బన్ ఎస్ఐ సుమన్ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో మాట్లాడరాదని, తినుబండారాలు తీసుకోరాదన్నారు. స్పర్శలోని తేడాలను తెలుసుకోవాలని కోరారు. అనంతరం మహిళా పోలీసుల ఆధ్వర్యంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ క్రైం, ఎమర్జెన్సీ హెల్ప్ లైన్‌లకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కరస్పాండెంట్ సిస్టర్ సుందరి, పలువురు మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామినాథన్ జయంతి

చిలకలూరిపేట, ఆగస్టు 7: పట్టణంలోని రాగన్నపాలెంలో మాస్టర్ మైండ్స్ స్కూల్‌లో బుధవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ జయంతి కార్యక్రమాన్ని, రవీంద్రనాధ్ ఠాగూర్ వర్ధంతిని నిర్వహించారు. వారి జీవిత చరిత్రలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. స్కూల్ డైరెక్టర్ మహమ్మద్ తమీమ్ దాదా సాహెబ్ సేవా సమితి అధ్యక్షుడు సిద్ధాంతి కరిముల్లా, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు, ఆర్యవైశ్య కల్యాణ మండపం కార్యదర్శి చేవూరి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా వేదిక

నాదెండ్ల, ఆగస్టు 7: మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం 10 గంటలకు ప్రజా వేదిక కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. మండలంలోని 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అంశాలపై ప్రజావేదిక జరుగుతుందన్నారు.